

ప్రణవ స్వరూపా..లక్ష్మీనరసింహా!





కల్యాణం సందర్భంగా స్వామిని శుక్రవారం ఊరేగుతున్న నరసింహ స్వామి.. జీలకర్ర బెల్లం చూపుతున్న పండితులు



కల్యాణ కాంతులు : విద్యుత్ వెలుగులు మధ్య అంతర్వేది లక్ష్మీ నరసింహుడి ఆలయ ప్రాంగణం



ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి



కల్యాణ క్రతువు

ఆహా ఏమి వైభోగం.. కన్నులారా చూడాల్సిందే.. తరలించాల్సిందే.. శ్రీకర..శుభకర ప్రణవ స్వరూపా లక్ష్మీనరసింహ అంటూ మనసారా కొలవాల్సిందే.. ఇలపై లక్ష్మీనరసింహస్వామి ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిని కల్యాణమాడారు.. శ్రీ వైఖానస ఆగమానుసారం వైష్ణవ సంప్రదాయం ప్రకారం అర్చక బృందం శుక్రవారం దశమి రాత్రి 12:55 గంటలకు మృగశిర నక్షత్రయుక్త వృశ్చికలగ్న మందు స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.. వైష్ణవ సంప్రదాయబద్ధంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సాగిన ఈ కల్యాణ తంతును భక్తులు తన్మయత్వంతో చూసి తరించారు. ఈ కల్యాణం తిలకించేందుకు ఎక్కడెక్కడి నుంచో భక్తజనం తరలివచ్చారు. ఉదయం గ్రామోత్సవం వైభవంగా సాగింది. భక్తజన సందోహంతో అంతర్వేది నిండిపోయింది.. సుమారు నాలుగు గంటల పాటు సాగిన కల్యాణాన్ని భక్తులు ఆద్యంతం వీక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం మధ్యాహ్నం 2.05 గంటలకు స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

6

అనంత.. దారుణాలైనా రాజాలు!





- హత్యలు చేసి నేతల దర్జా
- కూటమిలోనూ చర్యలు నిల్
- డ్రైవర్ హత్య కేసులో అనంతబాబు
- మధ్యంతర బెయిల్‌పై బయటకు
- విలేకరి హత్య కేసులో రాజా
- ముందస్తు బెయిల్ కొట్టేసిన హైకోర్టు
- అయినా అరెస్ట్ చేయని పోలీసులు
- నవంబరులో కేసు సీఐడీకి అప్పగింత
- అరెస్ట్ చేసే అవకాశం ఉన్నా బేఖాతరు
- శిక్షిస్తామని యువగళంలో లోకేశ్ హామీ
- ఇద్దరు ఏ1లే.. అయినా తేలని కేసులు

వారిద్దరు వైసీపీలో అత్యంత కీలకమైన నేతలు.. జగన్‌కు బాగా సన్నిహితులు.. ఒకరేమో ఎమ్మెల్సీ.. ఇంకొకరేమో మాజీ మంత్రి.. అధికారంలో ఉండగా వీరిద్దరు చెలరేగిపోయారు.. చట్టాన్ని చుట్టంగా భావించారు. ఏం జరిగినా వెంట జగన్ ఉన్నారనే ధైర్యంతో ఏకంగా హత్యలకు పథక రచన చేశారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ హత్య కేసుల్లో ఏ1 నిందితులే. వీరిలో ఒకరేమో మధ్యంతర బెయిల్‌పై ఇప్పటికీ దర్జాగా బయటే తిరుగుతున్నారు. మరొకరేమో హత్య కేసులో హైకోర్టు తన ముందస్తు బెయిల్ కొట్టేసినా ఏ మాత్రం భయం లేకుండా స్వేచ్ఛగా తిరుగుతున్నారు. వారిద్దరే..వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కూటమి వచ్చింది..ఇంకేంటి తప్పుడు పనులు చేసిన వైసీపీ నాయకుల పనైపోతుందనుకున్నారంతా.. అయితే సీఎం చంద్రబాబు మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారు.. కాకినాడ జిల్లాలోనే చూస్తే ఇద్దరు వైసీపీ ముఖ్య నేతలపై హత్య కేసులు ఉన్నాయి. చాలా ఏళ్లగా ఈ కేసులు నానుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే నాయకుల లెక్క తేలుతుందని అంతా ఆశించారు. అయితే 8 నెలలైనా ఇప్పటి వరకూ చర్యలు కానరాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా కదలిక ఆరంభమైంది. ఎందుకంటే మాజీ మంత్రి దాడిశెట్టి రాజా నిందితుడిగా ఉన్న ఆంధ్రజ్యోతి తొండంగి విలేకరి కాతా సత్యనారాయణ హత్యకేసు విచారణలో సీఐడీ స్పీడు పెంచింది. ఇటీవల కేసును రాజమహేంద్రవరం సీఐడీకి అప్పగించడంతో డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విచారణలో వేగం పెంచింది. ఇప్పటికే సత్యనారాయణ కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు నమోదు చేసిన సీఐడీ త్వరలో కేసుకు సంబంధించి మాజీ మంత్రి రాజాను విచారించనుంది.ఈ నేపథ్యంలో పూర్తి ఆధారాలతో కొత్తగా ఛార్జిషీటు వేయనుంది.కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తొండంగి మండలం ఆంధ్రజ్యోతి విలేకరిగా పనిచేసిన కాతా సత్యనారాయణ 2019 అక్టోబరు15న హత్యకు గురయ్యారు. విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఎస్.అన్నవరంలోని తన ఇంటికి వెళ్తున్న సమయంలో రాత్రివేళ కొందరు అగంతకులు అప్పటి తుని వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న దాడిశెట్టి రాజా నివాసానికి దగ్గరలో లక్ష్మీదేవి చెరువు గట్టుపై మాటువేసి సత్యనారాయణను హతమార్చారు.ఈ సంఘటన అప్పట్లో సంచలనమైంది. ఈ హత్యకు వైసీపీ నేత దాడిశెట్టి రాజా సూత్రధారి అని మృతుడి కుటుంబీకులు అప్పట్లో ఆరోపించారు. కేసు నమోదైనా అప్పటిలో అరెస్ట్ అవకుండా పోలీసులపై ఒత్తిడి తెచ్చారు.ఈలోపు దాడిశెట్టి రాజాకు మంత్రి పదవి లభించింది. దీంతో కేసు మరింత నీరుగారిపోయింది. 2023 లో దాఖలు చేసిన చార్జ్‌షీట్ నుంచి మంత్రిగా ఉన్న దాడిశెట్టి రాజా పేరును పోలీసులు తొలగించారు. అసలు రాజాకు హత్యతో సంబంధం లేదని బుకాయించారు. ఆర్థిక కారణాలతో హత్య జరిగిందంటూ కేసును తప్పుదోవ పట్టించి మమ అనిపించారు. దీనిపై న్యాయవాది అయిన సత్యనారాయణ సోదరుడు గోపాలకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజా పాత్రకు సంబంధించి ఆధారాలు, పలుసార్లు రాజా అనుచరులు తన సోదరుడిని బెదిరించిన ఘటనలకు సంబంధించిన వివరాలు న్యాయస్థానానికి అందించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో భాగంగా తునికి వచ్చిన నారా లోకేశ్‌ను కలిసి సత్యనారాయణ కుటుంబీకులు తమ ఆవేదన వినిపించారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.దీనిపై లోకేశ్ స్పందించి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనుకున్నట్టుగానే కూటమి ప్రభుత్వం రాగానే పోలీసులు మళ్లీ హత్య కేసును తిరిగి తెరిచారు.మూడు నెలల కిందట తిరిగి దాడిశెట్టి రాజాను పోలీసులు హత్య కేసులో ప్రధాన నిందితుడిగా చేర్చారు. ఈ నేపథ్యంలో అరెస్ట్ తప్పదన్న భయంతో రాజా ముందస్తు బెయిల్‌కు హైకోర్టును ఆశ్రయించారు. అయితే న్యాయస్థానం రాజాకు ముందస్తు బెయిల్ నిరాకరించి పోలీసుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, వైసీపీ నేత దాడిశెట్టి రాజాను ఏ క్షణమైనా పోలీసులు అరెస్ట్ చేస్తారని అంతా భావించారు. కానీ నెలలు గడుస్తున్నా ఇంత వరకు రాజావైపు అసలు పోలీసులు కన్నెత్తి చూడలేదు. దీంతో రాజా దర్జాగా బయటే తిరుగుతున్నారు. నవంబరులో ఈ కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. సీఐడీ తొలుత రెండుసార్లు మాత్రమే కేసు విచారణకు తుని వచ్చింది. తాజాగా రాజమహేంద్రవరం నుంచి సీఐడీ డీఎస్పీ ఆధ్వర్యంలో బృందం విచారణ ముమ్మరం చేసింది. లోతుగా దర్యాప్తు చేపట్టింది. సత్యనారాయణ విలేకరిగా ఉన్న సమయంలో రాసిన కథనాలను సేకరించే పనిలో పడింది. వీటన్నింటి లోతుగా శోధించి పూర్తిస్థాయి పక్కా ఆధారాలతో సిద్ధమవుతోంది. ఆ తర్వాత మాజీ మంత్రి రాజాను సైతం విచారించనుంది. అలాగే పక్కా ఆధారాలు అన్నీ చేతికి వచ్చిన తర్వాత అరెస్టులు, కొత్త చార్జిషీటు దాఖలు చేయనుంది.

ప్రభుత్వం మారినా.. ఏ1లు బయటే

చంపేసి.. డోర్ డెలివరీ చేసినా..

ప్రశాంత జిల్లాగా పేరొందిన కాకినాడ 2022 మేలో అట్టుడికిపోయింది. తన వద్ద పనిచేసే దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి ఆనక మృతదేహాన్ని ఇంటికి డోర్‌డెలివరీ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన ఎమ్మెల్సీ అనంతబాబు మే 18న రాత్రి కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చి పని ఉందని తీసుకువెళ్లాడు.ఆ తర్వాత తెల్లవారుజామున మే 19న మృతదేహాన్ని స్వయంగా తన కారులో అనంతబాబు కాకినాడ కుళాయిచెరువు ఎదురుగా ఉన్న డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఇంటికే తీసుకెళ్లినట్టు కేసు నమోదైంది. రోడ్డు ప్రమాదంలో సుబ్రహ్మణ్యం చనిపోయాడని ఆయన తల్లిదండ్రులను నమ్మించే ప్రయత్నం చేశాడు. సుబ్రహ్మణ్యం కుటుంబీకులు తిరగబడడంతో బెదిరింపులకు దిగాడు. ఆగ్రహంతో బాధితులు నిలదీయడంతో కారు వదిలేసి అక్కడి నుంచి అనంతబాబు పారిపోయాడు.ఈ కేసులో అనంతబాబును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. సుదీర్ఘకాలం జైల్లో గడిపిన అనంతబాబు మధ్యంతర బెయిల్‌పై ప్రస్తుతం స్వేచ్ఛగా బయటే తిరుగుతున్నాడు. హత్య కేసు ఆరోపణల కారణంగా అనంత బాబును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించిన జగన్ ఆ తర్వాత పక్కన పెట్టుకుని బహిరంగ సభలకు హాజరవడంపై అంతా నోరెళ్లబెట్టారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో భాగంగా 2023 డిసెంబరులో పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించిన దళిత సభలో సుబ్రహ్మణ్యం తల్లిదండ్రుల ఆవేదన విని చలించిపోయారు. టీడీపీ అధికారంలోకి రాగానే హత్య కేసును సీబీఐకి అప్పగించి అందరికి శిక్ష పడేలా చేస్తానని పేర్కొన్నారు.తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటినా ఇంత వరకు అనంతబాబుపై ఈగ కూడా వాలలేదు. ఇచ్చిన మాట ప్రకారం లోకేశ్ ఈ కేసుపై ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉన్నా ఆపని చేయడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో జిల్లా పోలీసుశాఖ సైతం నాటి కేసుల వివరాలు సర్కారుకు పంపినా ఇంకా చలనం లేదు. వాస్తవానికి ఈ హత్యకేసును ప్రభుత్వం లోతుగా పునర్విచారించే అవకాశం ఉన్నా ఆ దిశగా అడుగులు పడడంలేదు. ఈ కేసుపై సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ నిందితుడు, ఆయనకు సహకరించిన అందరూ దర్జాగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఉనప్పుడు అనంతబాబుపై పోలీసులు వేసిన ఛార్జిషీటులో అనంత బాబుపై అసలు రౌడీషీట్ లేదని పేర్కొన్నారని, ఆ తర్వాత తాము పోరాడితే రౌడీషీట్ ఉందని న్యాయస్థానానికి తెలిపారన్నారు. ఇప్పటికైనా కేసును లోతుగా విచారించేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గో..గో.. గోల్డ్!



- 24 క్యారెట్ తులం రూ.86,510
- 22 క్యారెట్ తులం రూ.79,300
- కేజీ వెండి రూ.98,800

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోల్డ్ ధర..గో..గో..గోల్డ్ అని ఎవరో తరుముతున్నట్టు పరుగులు పెడు తోం ది. సామాన్య మధ్యతరగతి ప్రజలకు దడ పుట్టిస్తోంది.10 గ్రాముల ధర రూ.లక్ష అవుతుందేమోననే ప్రచారం జరుగు తోంది. వెండి ధర పెరుగుతోంది. కేజీ వెండి ధర రూ.లక్షకు చేరువగా ఉంది. జనవరి నుంచి కేవలం ఫిబ్రవరికి నెల రోజుల్లో ధరలు పెరిగాయి.జనవరి ఒకటో తేదీన 22 క్యారెక్ట్ 10 గ్రాముల బం గారం ధర 71,500గా ఉంది. జనవరి నుంచి గురువారం నాటికి రూ.7,800 పెరిగి 10 గ్రాముల ధర ఏకంగా రూ.79, 300కు చేరింది. రెండు రోజులుగా ఇదే ధర కొనసాగు తోంది. ఇదే పెరుగుదల కొనసాగితే 10 గ్రాముల ధర రూ.80 వే లకు చేరవచ్చు. నెమ్మదిగా రూ. లక్షకు చేరు తుందే మోననే అంచనాలు న్నాయి. 24 క్యారెక్ట్ 10 గ్రాముల ధర జనవరి 1న రూ.78 వేలుగా ఉంది. గురువారం 86,510కు చేరింది. శుక్రవారం అదే ధర కొనసాగింది. నెల రోజుల్లో రూ.8,500 పెరిగింది.మాఘమాసం పెళ్లిళ్ల సీజన్ కావడంతో ధరల పెరుగుదల కొనుగోలుదారులకు అదనపు భారమే.

వెండి కేజీ రూ.98,800

వెండి ధరలు పెరిగిపోతున్నాయి. జనవరి 1న 88,400గా ఉన్న ధర గురువారం నాటికి రూ. 99 వేలకు చేరింది. మరో వెయ్యి పెరిగితే కేజీ వెండి ధర రూ.లక్షకు చేరుకునేది. కానీ శుక్రవారం రూ.200 తగ్గి 98,800లకు చేరింది. జనవరి నుంచి రూ.10,600 పెరిగింది.

కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా పి.వి. రామలింగేశ్వర్ నియమితులయ్యారు. ఇక్కడి అదనపు కమిషనర్ గతంలోనే బదిలీ కావడంతో ఈ పోస్టు ఖాళీగా ఉంది.ఇప్పటి వరకూ ఆయన అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా ఉన్నారు. రాజ మహేంద్రవరం బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన బాధ్యతలు చేపట్టవలసి ఉంది.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 137 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా శుక్రవారం 12 సెంటర్లలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. మొదటి, రెండో ఏడాది కలిపి 1435 మంది హాజరు కాగా 137 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్. నరసింహం తెలిపారు. జనరల్ ప్రాక్టికల్స్ మొదటి,రెండో స్పెల్‌కి సంబంధించిన చీఫ్ సూపరింటెండెంట్లకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓరియంటేషన్ ట్రైనింగ్ నిర్వహించామన్నారు. ఇంటర్ పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలన్నారు. విద్యార్థులు ప్రాక్టికల్స్ నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

పుష్కరాలకు 26 థీమ్ పార్కుల అభివృద్ధి

అధికారులతో సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వచ్చే పుష్కరాల నాటికి రాజమహేంద్రవరంలో మరో 26 పార్కులను థీమ్ పార్కులుగా అభివృద్ధి చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పార్కులు, కడియం నర్సరీల్లో టూరిజం, నగరవనం అభివృద్ధి వంటి అంశాలపై నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి సమీక్షించారు. నగరంలో పార్కులను మూస పద్ధతిలో కాకుండా ప్రత్యేక థీమ్‌తో నగర ప్రజలను, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. సెవెన్ హిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 26 పార్కుల పనులపై విపులంగా ఆరా తీశారు. ఇప్పటికే నగరంలో కంబాల చెరువు పార్కు, దానవాయిపేట, ప్రకాశ్‌నగర్, జేఎన్‌రోడ్డు, ఏవీ అప్పారావురోడ్డు ప్రాంతాల్లో మంచి పార్కులు అభివృద్ధి చేశామని.. వాటిని మరింత విలువ ఆధారిత విధానంలో అభివృద్ధి చేయాలన్నారు. వినోదంతో పాటు విజ్ఞానం కూడా కలిగించేలా పార్కులు ఉండాలన్నారు. థీమ్ పార్కుల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వినూత్నంగా నగరవనం అభివృద్ధి చేయనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఎకో ఫ్రెండ్లీ విధానంతో పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రణాళిక తయారు చేసినట్టు చెప్పారు. కడియం నర్సరీ ప్రాంతాల్లో పర్యాటక రూట్ మ్యాప్‌పై కలెక్టర్ నర్సరీల ప్రతినిధులతో సంప్రదించి కార్యరూపం చేపట్టినట్టు తెలిపారు. బోటింగ్, స్టాల్స్, జిప్‌లాగ్, అడ్వంచర్ స్పోర్ట్స్ తదితర అంశాలపై రూట్ మ్యాప్ రూపొందించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శైలజవల్లి, ఆర్ఎంసీ అధికారి అబ్దుల్ మాలిక్, సెవెన్ హిల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఏపీ ఎంఐపీపీడీ ఎ.దుర్గేష్, ,జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, ఎంపీడీవో కె.రమేష్, కడియం డిప్యూటీ తహశీల్దార్ సునీల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

యువర్ అటెన్షన్ ప్లీజ్!



రైల్వేలో పనులు చురుగ్గా సాగుతున్నాయి.. గత వారం రోజులుగా పనులను వేగవంతం చేశారు.. పట్టాలపై పనులను పరుగులు పెట్టిస్తున్నారు.. శుక్రవారం ఆర్చి బ్రిడ్జిపై స్లీపర్ల మార్పు చేశారు.. 1997లో ఈ ఆర్చి బ్రిడ్జిని నిర్మించారు.. నాటి నుంచి స్లీపర్లు (సిమెంట్ దిమ్మెలు) మార్చలేదు. అంటే 28 ఏళ్లుగా స్లీపర్లు రైళ్ల కింద నలుగుతూనే ఉన్నాయి. స్లీపర్లు అన్నీ పాడైపోవడంతో శుక్రవారం మార్పుచేశారు. మరో వారంలో రైల్వే జీఎం రానుండడంతో భద్రతకు సంబంధించిన పనులు వేగవంతం చేశారు. - వివరాలు 7లో

నేటి నుంచి ధవళగిరి జనార్దనుడి కల్యాణోత్సవాలు

6

కమనీయం.. రమణీయం

లక్ష్మీనరసింహుడి కల్యాణం

● అంతర్వేది పుణ్యక్షేత్రంలో అంగరంగ వైభవంగా వేడుక

అంతర్వేది, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో అగ్రగామి అయిన అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కల్యాణోత్సవ శోభతో వెల్లివిరిసింది. వేద మంత్రోచ్చారణలతో సకల దేవతల ఆశీర్వచనాలతో శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారు ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిను కల్యాణ మాడారు. శ్రీ వైఖానస ఆగమానుసారం వైష్ణవ సాంప్రదాయం ప్రకారం ఆలయ స్థానాచార్యులు వింజమూరి రామలింగాచార్యులు, ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, వేదపండితులు చింతా వేంకటశాస్త్రి వారి సమక్షంలో అర్చక బృందం పేరూరు ఉద్దండ పండితులు కల్యాణాన్ని నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సాగిన ఈ కల్యాణ తంతును భక్తులు తన్మయత్వంతో చూసి తరించారు. అంతర్వేదిలో శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణం శుక్రవారం దశమి రాత్రి 12.55 గంటలకు (తెల్లవారితే శనివారం) మృగశిర నక్షత్రయుక్త వృశ్చికలగ్నమందు అంగరంగ వైభవంగా జరిగింది. వైష్ణవ సంప్రదాయబద్ధంగా వేదపండితులు, అర్చక స్వాములు కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుభ ముహూర్తానికి జీలకర్ర, బెల్లం స్వామివారి శిరస్సుపై ప్రధాన అర్చకులు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల శిరస్సులపై సహాయ అర్చకులు ఉంచారు. ఆలయం ముందు నిర్మించిన శాశ్వత షెడ్లలో భక్తులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆసీనులై స్వామివారి కల్యాణం వీక్షించారు. ఉభయ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. సుమారు నాలుగు గంటల పాటు సాగిన కల్యాణాన్ని భక్తులు ఆద్యంతం వీక్షించారు. అనంతరం తెల్లవారుజామున దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఎదురు చూశారు.



స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

● ఎదురు సన్నాహంతో శ్రీకారం..

రాత్రి 11 గంటలకు ఎదురు సన్నాహంతో కల్యాణ తంతు ప్రారంభమైంది. అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరుకు చెందిన ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబరు రాజా కలిదిండి కుమార రామ గోపాలరాజా బహదూర్ శ్రీవారి తరపున, అర్చక స్వాములు అమ్మవారి తరపున వివాహ కర్తలుగా వ్యవహరించారు. ఆలయం నుంచి తొలుత స్వామివారిని తర్వాత అమ్మవార్లను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు, అధికారులు పల్లకీలో వేర్వేరుగా కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. శ్రీవారు-అమ్మవార్లకు అంతర్వేదికరకు చెందిన డాక్ట ర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ, కుటుంబీకులు గతంలో ఇచ్చిన ఆభరణాలను అర్చకులు అలంకరించారు. కల్యాణం నిర్వహణలో ఆనవాయితీ ప్రకారం పేరూరు వేదపండితులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి తలంబ్రాలను పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పొలమూరి కుటుంబీకులు తీసుకువచ్చారు.

● స్వామి, అమ్మవార్లకు మధుపర్కాలు..

కల్యాణానికి ముందు దేవస్థానం తరపున ఆలయ అధికారులు, ప్రభుత్వ ప్రతినిధిగా రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్, మొగల్తూరు రాజావారు ఆలయ ఫౌండర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహదూర్, కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, జేసీ టి.నిశాంతి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, ఎస్పీ బీ.కృష్ణారావు, ఆలయ అధికారులు, భక్తులు శ్రీస్వామి-అమ్మవార్లకు మధుపర్కాలు సమర్పించారు.

● అద్భుతంగా విద్యుత్ అలంకరణలు..

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా అంతర్వేది పుణ్యక్షేత్రం విద్యుత్ అలంకరణల నడుమ రంగురంగులతో భక్తులకు కనువిందు చేస్తుంది. భక్తుల రద్దీ ఉన్న ప్రతి ప్రధాన కూడలిలో కల్యాణోత్సవాలను తిలకించేలా పన్నెండు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటుచేసి గ్రామ పురవీధుల ముఖద్వారాలను సుందరంగా విద్యుత్ కాంతులతో అలంకరించారు.స్వామివారి అంతరాలయం, బేడ మండపం, రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయం, పశ్చిమ ముఖద్వారం, కల్యాణ మండపద్వారాం, కల్యాణ మండపాలను బెంగుళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన పచ్చిపూలతో సుందరాతిసుందరంగా అలంకరించారు. అలాగే కల్యాణ మండపం, ఆలయాలను విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. అయోధ్య, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, పరమశివుడు, నరసింహస్వామి, పాతాలభైరవి, వివిధ సెట్టింగ్‌లతో ఆలయ పుణ్య క్షేత్రమంతా అలంకరించారు.

భక్తజన హారతి

కల్యాణోత్సవాల్లో భాగంగా రథసప్తమి రోజు మొదలుకుని తొమ్మిది రోజుల పాటు వేకువజామున భక్తులు సముద్రస్నానాలు ఆచరించడం ఆనవాయితీ. దీంతో పవిత్ర సాగరసంగమంగా పేరొందిన అంతర్వేది తీరం భక్తులతో కిటకిటలాడుతోంది. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. బ్రహ్మదేవునిచే ప్రతిష్ఠింపబడిన క్షేత్రపాలకుడు నీలకంఠేశ్వరుడుతో పాటు క్షేత్రసంరక్షకుడు ఆంజనేయస్వామి, స్వామివారి సోదరి గుర్రాలక్కమ్మ, శ్రీ వశిష్ఠ ఆశ్రమ ఆలయాల్లో భక్తులు పూజలు గావించారు. కృష్ణా జిల్లా నుంచి రెండు రోజుల ముందే వచ్చిన భక్తులు కల్యాణ మండపం సమీపంలో నిద్రిస్తూ కల్యాణాన్ని తిలకించారు.





కల్యాణాన్ని తిలకిస్తున్న మంత్రి సుభాష్, కలెక్టర్, ఎస్పీ, తదితరులు



స్వామివారికి బంగారు ఆభరణాలతో అలంకరణ

అంతర్వేది, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా పది సంవత్సరాల నుంచి స్వామివారి పూర్వ నగలను బ్యాంకులో ఉంచి ప్రస్తుతం కొత్త ఆభరణాలతో అలంకరిస్తున్నారు. స్వామివారి కల్యాణ సమయంలో స్వామివారి కుందనపు కిరీటం ధరిస్తారు. వక్షస్థలం, శంఖుచక్రాలు, అనేక బంగారు ఆభరణాలు ధరించే స్వామివారిని దర్శించుకోవడం వల్ల జన్మజన్మల పుణ్యఫలం వస్తుందని పండితులు చెబుతున్నారు. ఈ ఆభరణాలన్నీ వజ్ర వైఢూర్యాలు, మరకత మాణిక్యాలు వంటివి పూర్వకాలంలో మహారాజులు సమర్పించారని చెబుతారు. పూర్వపు ఆభరణాలు శిథిలావస్థకు చేరుకోవడం వల్ల బ్యాంకుల్లో భద్రపరిచారు. అంతర్వేదికర గ్రామంలో ఉన్న అంతర్వేదికి చెందిన దివంగత డాక్టర్ పోతురాజు సూర్యవెంకట సత్యనారాయణ కుటుంబ సభ్యులచే ఉత్సవమూర్తులకు మాత్రం సాదా ఆభరణాలు తయారుచేయించి వాటిని వార్షికంగా ఉత్సవాలకు అలంకరిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం వాస్తవ్యులు మిరియాల గాంధీ దంపతులు స్వామివారికి బంగారు శఠగోపాన్ని, పూణె వాస్తవ్యులు వేంకటేశ్వరా హేచరీసంస్థ నిర్వాహకులు స్వామివారికి బంగారు పంచపాత్రలు, ఉద్ధరిణిలు, బిందె, పళ్లెం, బంగారు ఆభరణాలు సమర్పించారు.



కల్యాణోత్సవాల్లో స్వామివారికి అలంకరించిన ఆభరణాలు

పురవీధుల్లో వైభవంగా గ్రామోత్సవం



పంచముఖ ఆంజనేయ స్వామి వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి సత్యనారాయణమూర్తి, నరసింహస్వామివారిచే నిర్మితమైన పంచముఖ అంజనేయస్వామివారి వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిపారు. గ్రామపురవీధుల్లో స్వామివారు గ్రామోత్సవం జరగ్గా భక్తులంతా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టారు. అదే విధంగా రాత్రి తొమ్మిది గంటలకు అంతర్వేది పల్లిపాలెం అగ్నికుల క్షత్రియులచే నిర్మితమైన కంచుగరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. భక్తులంతా స్వామివారి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని కల్యాణ మండపానికి తీసుకునివెళ్లారు. కార్యక్రమంలో ఆలయ ఫ్యామిలీ ఫౌండర్ రాజాకలిదిండి కుమార రామ గోపాలరాజా బహదూర్, జేసీ నిషాంతి, అమలాపురం ఆర్డీవో కె.మాధవి, డీసీ డీఎస్పీ రమేష్‌బాబు, ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, పినివెట్టి బుజ్జి, గుబ్బల శ్రీను, ఆకన బాబ్జినాయుడు, భైరా నాగరాజు, సర్పంచ్ పోతురాజు నరసింహారావు (కిశోర్), ఎంపీపీ వీరా మల్లిబాబు, వలవల రాంబాబు, పోతురాజు వెంకటకృష్ణ, వనమాలి మూలాస్వామి, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కొపనాతి కృష్ణమ్మకు భారీ గజమాల

ఆలయానికి అగ్నికుల క్షత్రియులు, కొపనాతి కృష్ణమ్మ వారసులు భారీ ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి భారీ గజమాల సమర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అగ్నికుల క్షత్రియులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే ఉత్సవాల్లో సఖినేటిపల్లి, మామిడికుదురు, మలికిపురం మండలాలకు చెందిన సుమారు 200 మందికి పైగా స్కౌట్ విద్యార్థులు పాల్గొని సేవలందించారు. భజరంగదళ్, విశ్వహిందూపరిషత్, సత్యసాయి ట్రస్టు సభ్యులు ఉత్సవాల్లో సేవలు చేసేందుకు ముందుకు వచ్చారు. వైద్యం, తాగునీరు, పారిశుధ్యంపై అధికారులు దృష్టిసారించి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆలయానికి చేరుకున్న గజమాల →



● వెంకన్న పట్టు వస్త్రాలు..



పట్టు వస్త్రాలు అందిస్తున్న టీటీడీ సభ్యులు

మాఘమాసంలో దశమిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి 12.55 గంటలకు జరిగిన స్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం, శృంగేరీ పీఠం, అన్నవరం దేవస్థానాలు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ సాంప్రదాయాలతో అర్చకులు, అధికారులు పట్టు వస్త్రాలు తీసుకువచ్చిన సభ్యులకు ఘనస్వాగతం పలికి స్వామివారి దర్శనం అనంతరం పట్టువస్త్రాలను ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, అర్చకులు కల్యాణ మహోత్సవానికి తీసుకువెళ్లారు.

● కల్యాణం టిక్కెట్ రూ.200



స్వామివారి కల్యాణం టిక్కెట్

అంతర్వేది, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఆరు బయట జరిగే కల్యాణోత్సవాల్లో అంతర్వేది పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవం వీక్షించడానికి ఉభయ రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు లక్షలాది మంది తరలివచ్చారు. రెవెన్యూ, దేవదాయ శాఖల ఆధ్వర్యంలో జరిగే స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు ఆలయం వద్దనున్న కౌంటర్‌లో రూ. 200 చొప్పున ఉదయం నుంచి 1500 కల్యాణం టిక్కెట్లను తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు విక్రయించారు. సుమారు మూడు వేల మంది కల్యాణాన్ని ప్రత్యక్షంగా తిలకించారు. అలాగే లక్షలాది మంది భక్తులు 12 ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా స్వామివారి కల్యాణాన్ని తిలకించారు.

● నేడు స్వామివారి రథోత్సవం

స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం భీష్మఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2.05 గంటలకు ప్రారంభం కానుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు శుక్రవారం రాత్రికే రథం వద్ద అరటి పండ్లు, గుమ్మడికాయలు, ధాన్యం కుచ్చులను వాహనకారులకు అందజేశారు. వాటితో వాహనకారులు రథాన్ని అలంకరించారు.

ఆకట్టుకున్న విడాకులు కావాలి నాటిక

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా కళాతోరణ బత్తుల మురళీకృష్ణ కళావేదికపై మార్కండేయ నాటకకళాపరిషత్ ఆధ్వర్యంలో తెలుగురాష్ట్రాల నాటిక పోటీలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా రెండోరోజు ప్రదర్శించిన 'విడాకులు కావాలి నాటిక' ప్రేక్షకులను ఆకట్టుకుంది. జీవితంలో దంపతుల మధ్య అభిప్రాయ భేదాలు, చిన్నచిన్న సమస్యలు సహజమేనని, అంతమాత్రాన విడాకులు తీసుకోవడం సమంజసం కాదని చాటిచెప్పడమే ఈ నాటిక సారాంశం. దీన్ని వల్లూరి శివప్రసాద్ రచించగా, గంగోత్రి సాయి దర్శకత్వం వహించారు.



విడాకులు కావాలి నాటికలో సన్నివేశం

● జనరల్ బోగీ కష్టాలు అన్నీఇన్నీ కావు

రైళ్లల్లోని జనరల్ బోగీల్లో ప్రయాణించే ప్రజల కష్టాలను కళ్లకు కట్టినట్టు కొలకలూరి సాయి ఆర్ట్స్ కళాకారులు ప్రదర్శించారు. జనరల్ బోగీలు తగ్గిపోవడం, అందులో ప్రయాణించే వారి వివరాలు రైల్వేశాఖ వద్ద లేక ఏదైనా విపత్తు జరిగినప్పుడు తలెత్తుతున్న పరిణామాలు గురించి తెలియజెప్పారు. కథను పీటీ మాధవన్ రచించగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. దీనిలో భాగంగా కార్యక్రమానికి హాజరైన హైకోర్టు అసిస్టెంట్ రిజిస్ట్రార్ అత్తిన వేణుగోపాలరావును మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి, ఇతర ప్రతినిధులు సత్కరించారు.

నేడు జనార్దనుడి రథోత్సవం



ముస్తాబైన ఆలయ పరిసరాలు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ధవళగిరిపై వెలసిన లక్ష్మీజనార్దన స్వామి రథ, కల్యాణోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. తెల్లవారుజాము నుంచే గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల కోసం పంచాయతీ ఆధ్వర్యంలో నది ఒడ్డున షవర్లు, మహిళలు దుస్తులు మార్చుకోవడానికి ప్రత్యేక శిబిరాలను అందుబాటులో ఉంచారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ, బ్రాహ్మణ సేవా సంఘం, వివిధ సేవా సంఘాలు, జనసైనికుల ఆధ్వర్యంలో అల్పాహారం, అన్నదానం, పులిహోర, మజ్జిగ, మంచినీరు వితరణకు ఏర్పాట్లు చేశారు. రథోత్సవం సాగే రహదారిపై విద్యుత్ నిలిపివేసి సర్వీస్ వైర్లను తొలగించడం వల్ల రహదారి పొడవునా జనరేటర్ ద్వారా ఫ్లడ్‌లైట్లు వెలిగే విధంగా తీర్చిదిద్దారు. పోలీసుల భారీ బందోబస్తుతో రథోత్సవం వేళ ధవళేశ్వరం ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిపివేసి ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు.

డెల్టాకు 8,650 క్యూసెక్కుల నీటి విడుదల

ధవళేశ్వరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రబీ పంటల అవసరాల నిమిత్తం కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు 8,650 క్యూసెక్కుల నీటిని అధికారులు శుక్రవారం విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,450, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 4400 క్యూసెక్కులు చొప్పున జలాలు విడుదలయ్యాయి.

ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 9.85 అడుగులుగా నమోదు కాగా, నీటి లభ్యత 8882 క్యూసెక్కులుగా నమోదయ్యింది.

అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామికి ..

అన్నవరం దేవస్థానం పట్టు వస్త్రాలు

●సమర్పించిన ఈవో సుబ్బారావు దంపతులు



స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఈవో సుబ్బారావు

అన్నవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణానికి అన్నవరం దేవస్థానం తరపున ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. వీటిని అంతర్వేది ఉత్సవాల అధికారి డీఎస్పీ రమేష్‌బాబు, సహాయ కమిషనర్ సత్యనారాయణకు అందజేశారు. అన్నవరం అధికారులకు వారు స్వాగతం పలికారు. వారి వెంట దేవస్థానం వేదపండితుడు శివ , తదితరులు వున్నారు.

● వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక భోజనశాల

రత్నగిరికి విచ్చేసే వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక భోజనశాలను శుక్రవారం ప్రారంభించారు. ఇప్పటివరకు అందరికీ ఒకే భోజనశాలలో అన్నప్రసాదం వితరణ చేస్తుండగా వృద్ధులు, దివ్యాంగ భక్తుల అవస్థలను చూసి ఈవో వెంటనే ప్రత్యేక శాల ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

దీంతో పాత సీఆర్వో కార్యాలయ దిగువ అంతస్తులో హాలును పార్టీషన్ చేయగా పీఆర్వో కృష్ణారావు ప్రారంభించారు. ఒకేసారి 200 మంది భోజనం చేసేలా సౌకర్యం కల్పించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అన్నదాన విభాగ అధికారులు రామకృష్ణ, కంచిబొట్ల రాంబాబు, బండారు రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

అమలాపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు సంబంధించిన కేసులు కూడా లోక్ అదాలత్‌లో పరిష్కరిస్తారన్నారు. ఉమ్మడి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీ పడ దగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటికేషన్ కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరిస్తారన్నారు.

కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సునీత కోరారు.

'స్పేసెస్'లో స్పందన యువజనోత్సవాలు



మాట్లాడుతున్న శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయప్రకాష్

తుని రూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో స్పందన యువజనోత్సవాలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ యూత్ ఫెస్టివల్‌లో విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. సంగీతం, సాహిత్యం, నృత్యం, థియేటర్ ఆర్ట్స్, ఫైన్ ఆర్ట్స్, క్రీడల నందు సుమారు 30 అంశాలలో విద్యార్థినీ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, అతిథులు, మోడరేటర్ జి.గ్లోరియా, జూనియర్ లెక్చరర్ ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్, హంసవరం, శాంతికపోతాలు ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థి అతిథులతో మోడరేటర్ గ్లోరియా నిర్వహించిన ప్యానల్ డిస్కషన్‌లో కెరియర్‌లో సాఫ్ట్ స్కిల్స్‌పాత్ర అనే అంశంపై విద్యార్థి అతిథులు తమ అభిప్రాయాలను తెలిపారు. విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఓటే మాట లేదు ఆడే వాళ్ళకి అనే వేటూరి పాటను ఉదహరిస్తూ నిరంతరం ప్రయత్నించడం ద్వారా గెలుపు సాధ్యమవుతుందని, విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి స్పందన ఒక వేదిక కాగలదని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ హెచ్ఆర్ వీవీఎస్‌బీ బంగార్రాజు, వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు సిద్ధివినాయకుడి కలముల పంపిణీ

అయినవిల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి శ్రీసిద్ధి వినాయకుని సన్నిధిలో స్వామి వారి చెంత ఉంచి పూజించిన కలములను శని, ఆదివారాల్లో భక్తులకు పంపిణీ చేయనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. విఘ్నేశ్వరస్వామి వారి చెంత ఉంచి పూజించిన కలములతో పరీక్షలు రాస్తే దిగ్విజయంగా ఉంటుందని భక్తుల విశ్వాసం.



అయినవిల్లిలో పంపిణీకి సిద్ధం చేసిన కలములు

శుభ కార్యానికి వెళుతుండగా

రోడ్డు ప్రమాదం

● భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు



సంఘటనా స్థలంలో ఉన్న రాజేశ్వరిని పరీక్షిస్తున్న 108 సిబ్బంది, గాయపడిన వెంకటేశ్వరరావును ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

రాజానగరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు జాతీయ రహదారి గైట్ కళాశాల సమీపం లో శుక్రవారం రోడ్డుప్రమాదం జరిగింది. దీంతో భార్య అక్కడికక్కడే మృతిచెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. తూర్పుగోదావరిజిల్లా రాజ మహేంద్ర వరంరూరల్ బొమ్మూరుకు చెందిన వాకలపూడి రాజేశ్వరి(65), భర్త వెంకటేశ్వరరావు కలిసి మోటార్ సైకిల్‌పై రాజానగరం మండలం పల్లకడియంలో జరిగే ఓ శుభకార్యానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో సరిగ్గా అశోక్ లేల్యాండ్ షోరూమ్ వద్దకు వచ్చేసరికి వీరు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్‌ను లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొంది. 108 సిబ్బంది క్షతగాత్రురాలిని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. కాగా వెంకటేశ్వరావు తలకు, చేతులకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ ఆప కుండా వెళ్లిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. చివరికి తూర్పుగోనగూడెం సమీపంలో పట్టుకున్నారు. రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ పర్యవేక్షణలో ఎస్ఐ మనోహర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోటనందూరు, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం బొద్దవరం గ్రామానికి చెందిన సుర్ల అప్పలనాయుడు (30) ఈనెల 2వ తేదీ రాత్రి పని ముగించుకుని మోటారుసైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా హెరిటేజ్ పాల డెయిరీ సమీపంలో ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు అతడిని 108 అంబులెన్సులో తుని ఏరియా ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు.

ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతి



కిర్లంపూడి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా కిర్లంపూడి మండలం భూపాలపట్నంలో ఒక వ్యక్తి ఏలేరు కాలువలో పడి మృతి చెందాడు. భూపాలపట్నం గ్రామానికి చెందిన వి.రామకృష్ణ (60) పనికి వెళ్లి వస్తుండగా ఏలేరు కాలువ బ్రిడ్జిపై కళ్లు తిరిగికాలువలో పడిపోయి మృతి చెందాడు. ఎస్ఐ సతీష్ సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

గండేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామ శివారున శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయాలపాలయ్యారు. తాడేపల్లి నుంచి రాయగడ వెళ్తున్న కారు మల్లేపల్లి గ్రామ శివారుకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో కారు పల్టీలు కొట్టింది. అందులో వున్న దంపతులకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం జగ్గంపేట ఆసుపత్రికి తరలించారు.

నేడు ద్రాక్షారామ

భీమేశ్వరుడి దివ్య కల్యాణం



ద్రాక్షారామ భీమేశ్వరస్వామి



స్వామి కల్యాణ మహోత్సవానికి సిద్ధమవుతున్న వేదిక



మాణిక్యాంబ అమ్మవారు

●రాత్రి 11.05 గంటలకు సుముహూర్తం ●శోభాయమానంగా భీమేశ్వరాలయం ముస్తాబు

ద్రాక్షారామ, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన పురాతన శైవక్షేత్రం, పంచారామం ద్రాక్షారామలో ఉన్నమాణిక్యాంబసమేత భీమేశ్వరస్వామివారి దివ్యకల్యాణం ఫిబ్రవరి 8న శనివారం జరుగుతుంది. స్వయంభువుడు శ్రీభీమేశ్వరస్వామివారు, ద్వాదశ శక్తిపీఠం మాణిక్యాంబ అమ్మవారికి, క్షేత్రపాలకులు శ్రీలక్ష్మీసమేత నారాయణస్వామివారు, శ్రీచండిక సమేత సూరేశ్వరస్వామివార్లకు ఒకే వేదికపై శనివారంరాత్రి ఆరుద్ర నక్షత్ర తులాలగ్న మందు రాత్రి 11.05 నిమిషాలకు ఏకకాలమందు కల్యాణ మహోత్సవం జరుగుతుంది.

లక్ష రుద్రాక్షలతో పూజ

శనివారం ఉదయం 5.45 గంటలకు కల్యాణ మూర్తులను ఆహ్వానిస్తారు. స్వామి కల్యాణమహోత్సవం పురస్కరించుకుని ఉదయం 8.15గంటలకు భీమేశ్వరుడికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగుతుంది. అనంతరం వ్యాపారవేత్త సత్తి సుబ్బారెడ్డి దంపతుల సౌజన్యంతో స్వామికి లక్ష రుద్రాక్షలతో పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 3.30గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం, 6గంటలకు నందివాహనంపై స్వామి నగరోత్సవం జరుగుతుంది. అనంతరం రాత్రి 11.05 గంటలకు పుష్పాలంకృతమైన కల్యాణవేదికపై స్వామివార్ల కల్యాణమహోత్సవం దేవస్థానం బ్రహ్మదేవులపల్లి పణిరామకృష్ణ, అర్చక, వేదపండిత బృందంచే జరుగుతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం స్వామి,అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

11న రథోత్సవం, 13న తెప్పోత్సవం

9న గరుడవాహనంపై స్వామివారి నగరోత్సవం జరుగుతుంది. 10న ఉదయం 10గంటలకు స్వామి నగరోత్సవం, రాత్రి 5.45గంటలకు స్వామివార్ల సదస్యం, రాత్రి8.00 గంటలకు సర్వ వాహనములపై స్వామివారి నగరోత్సవం జరుగుతుంది. 11న మధ్యాహ్నం 2.55 గంటలకు భీమేశ్వరుడి రథోత్సవం, సాయంత్రం 6.00 గంటలకు వేగాయమ్మపేట ఆస్థాన మండపంలో స్వామివార్ల ఆస్థాన పూజ జరుగుతుంది. 12న ఉదయం 7.55గంటలకు స్వామి వసంతోత్సవం, నాకబలి, తదుపరి త్రిశూల, శ్రీ చక్రస్నానం జరుపుతారు. 13న రాత్రి 6.35 గంటలకు సప్తగోదావరినదిలో స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తారు. 14న రాత్రి 7.05లకు స్వామివారి శ్రీపుష్పోత్సవం జరుగుతుంది.

శోభాయమానంగా కల్యాణ వేదిక

భీమేశ్వరస్వామి కల్యాణమహోత్సవాలు పురస్కరించుకుని ఆలయంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ అంతర ప్రాంగణంలో శోభాయమానంగా కల్యాణ వేదికను భారీగా తీర్చిదిద్దారు. స్వామి కల్యాణం వేలాది మంది తిలకించేందుకు ప్రత్యేకంగా పందిర్లు ఏర్పాటుచేశారు. ప్రత్యేక విద్యుత్ దీపాలంకరణ చేశారు. కల్యాణ మహోత్సవం తిలకించేందుకు వచ్చిన భక్తులకు స్వామి తీర్థప్రసాదాలతోపాటు, స్వామివారి కల్యాణ ముత్యాల తలంబ్రాలు అందజేస్తామని ఆలయ ఈవో, సహాయకమిషనర్ అల్లు వెంకట దుర్గా భవానీ తెలిపారు.



రాష్ట్ర యూత్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించే పిఠాపురంలోని బాస్కెట్‌బాల్ క్రీడామైదానం

నేటి నుంచి రాష్ట్ర యూత్ బాస్కెట్‌బాల్ పోటీలు

●పిఠాపురంలో నాలుగురోజులపాటు నిర్వహణ

పిఠాపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాతబస్టాండు వద్దగల మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నుంచి మాజీ మంత్రి కొప్పన మోహరావు, రమాదేవి స్మారక 8వరాష్ట్ర యూత్ బాలబాలికల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగనున్నాయి. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్, ఇన్ తూర్పుగోదావరి జిల్లా, పిఠాపురం బాస్కెట్‌బాల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ వరకూ డే అండ్‌నైట్ పద్ధతిలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలు నుంచి బాలబాలికల జట్లు పాల్గొననున్నాయని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు(అయలు) తెలిపారు. పిఠాపురంలో బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ నిర్వహించనున్న నేపథ్యంలో మునిసిపల్ పాఠశాల ఆవరణలోని బాస్కెట్‌బాల్ క్రీడా మైదానాన్ని సిద్ధం చేశారు. పోటీలకు తరలివచ్చే క్రీడాకారులకు వసతి ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన ఆలిండియా లాన్ టెన్నిస్ పోటీలు


● బాలురలో ఏపీ, బాలికల్లో తెలంగాణ విజేతలు

కాకినాడఅర్బన్, ఫిబ్రవరి7(ఆంధ్రజ్యోతి): మూడురోజులుగా కాకినాడజిల్లా క్రీడామైదానంలో జరుగుతున్న అండర్-16 లాన్ టెన్నిస్ పోటీలు శుక్రవారం ముగిశాయి. బాలుర విభాగం సింగిల్స్‌లో ధ్రువ్ (తమిళనాడు)పై విన్సెంట్ (ఏపీ)5-77-6 స్కోరుతో గెలుపొందాడు. బాలికల విభాగంలో జోహా(తెలంగాణ)పై గౌరిశ్రీ (తెలంగాణ)6-2,6-2 స్కోరుతో గెలుపొందారు. బాలికల డబుల్స్ విభాగంలో జోహా, సవర్షికలపై జోషిత, సుమేరా 6-2, 6-4 స్కోరు తో విజయం సాధించారు. బాలుర డబుల్స్ విభాగంలో విన్సెంట్, తనీష్‌లపై ప్రమోద్, భవేష్‌లు 6-3, 4-6, 10-6 స్కోరుతో విజయం సాధించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్ పాల్గొని విజేతలకు షీల్డులు, పతకాలు అందజేశారు. లాన్ టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బీవీ రామ్‌కుమార్, డాక్టర్ గిరి, హెచ్ఎస్ శర్మ, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఆలిండియా అండర్ 16 లాన్ టెన్నిస్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

కమాండెంట్‌గా నాగేంద్రరావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ముద్రగడ నాగేంద్రరావు

సర్పవరంజంక్షన్, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి) : కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్‌గా ముద్రగడ నాగేంద్రకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ అడిషనల్ కమాండెంట్‌గా విధులు నిర్వహించానని, తిరిగి కమాండెంట్‌గా రావడం ఆ నందంగా ఉందన్నారు. సిబ్బంది సంక్షేమంకోసం తనవంతు సహకారం అందిస్తానన్నారు. అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు మొక్క అందించి నాగేంద్రరావుకు స్వాగతం పలికారు. అనంతరం హెచ్ఏసీ కమాండెంట్ సీపీఏ రామకృష్ణ నుంచి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు బీఎస్ చంద్రశేఖర్, బి.శ్రీనివాస్‌బాబ్జి, ఆర్ఐలు విఠలేశ్వరరావు, రవిశంకర్, అజయ్‌కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.



క్యూలైన్లు పరిశీలిస్తున్న ఈవో, అధికారులు, వసతి సరిపడక ఆలయ ప్రాంగణంలో విశ్రమిస్తున్న భక్తులు

భీష్మ ఏకాదశి దర్శనంకోసం పోటెత్తిన భక్తులు

● వసతులు దొరక్క భక్తుల అవస్థలు

అన్నవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శనివారం భీష్మ ఏకాదశి పర్వదినాన సత్యదేవుడి దర్శనానికి శుక్రవారం రాత్రికే భక్తులు వేలాదిగా చేరుకున్నారు. భక్తులకు వసతి సరిపడక అవస్థలు ఎదుర్కొన్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత డార్మెటరీలు ఏర్పాటుచేశారు. శనివారం భక్తులు అధికసంఖ్యలో రానుండటంతో ఒంటిగంట నుంచి వ్రతాలు సర్వదర్శనాలను ప్రారంభించాలని సర్క్యులర్ జారీచేశారు. వ్రతాలు, దర్శనాలకు సంబంధించి భక్తులకు ఎక్కడా అసౌకర్యం లేకుండా అధికారులు ప్రత్యేకచర్యలు చేపట్టారు. పశ్చిమరాజగోపురంవద్ద హోల్డింగ్‌పాయింట్లను ఏర్పాటు చేశారు. ఆలయంలోపల వ్రతమండపాల ఖాళీని బట్టి భక్తులను లోపలకి అనుమతించాలని నిర్ణయించారు. త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా ఎక్కడికక్కడ వాటర్‌పాయింట్లు, సేవా సంస్థ సభ్యుల ద్వారా త్రాగునీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకున్నారు. ఏర్పాట్లను శుక్రవారం ఈవో వీర్ల సుబ్బారావు సిబ్బందితో పరిశీలించారు. శనివారం సుమారు 15 వేల వ్రతాలు జరిగి 80 వేలమంది భక్తులు విచ్చేస్తారని అంచనా వేస్తూ ఏర్పాట్లుచేశారు.

ఆర్చ్ బ్రిడ్జిపై స్లీపర్ల మార్పు

» గంటకు 130 కి.మీ. స్పీడు సామర్థ్యం

» 1997లో వేసిన సిమెంటు దిమ్మలకు మోక్షం



ఆర్చ్ బ్రిడ్జిపై స్లీపర్లు మారుస్తున్న టీఆర్టీ యంత్రం

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ఆర్చ్ బ్రిడ్జి రైల్వేట్రాక్ సేఫ్టీ మరమ్మతులు పూర్తయ్యాయని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్ఎం) నరేంద్ర ఎ.పాటిల్ పేర్కొన్నారు. చెన్నై-హౌరా సెక్షన్‌లో ఈబ్రిడ్జి ముఖ్యమైనదని తెలిపారు. ట్రాక్ రెనివల్ ట్రైన్(టీఆర్టీ) యంత్రాన్ని వినియోగించి అత్యంత వేగంగా పనులు పూర్తిచేశామన్నారు. కీలకమైన పనులను ఎంతో శ్రమించి పూర్తిచేసిన స్థానిక రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. కాగా.. ఆసియాలోనే పేరు గాంచిన ఆర్చ్ బ్రిడ్జిని 1997లో నిర్మించారు. అప్పటి అవసరాలకు అనుగుణంగా ట్రాక్ నిర్మాణం జరిగింది. తర్వాత రోజుల్లో రైల్వే ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. కానీ 28ఏళ్ల క్రితంవేసిన స్లీపర్లే ఉన్నాయి. ప్రస్తుతం ప్రతిరోజూ 86 రైళ్లు ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పట్టాల కింద ఉండే స్లీపర్లు(సిమెంటు దిమ్మలు) పాడయ్యాయి. 338 స్లీపర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సేఫ్టీ పనుల్లో భాగంగా వీటితోపాటు ఈ బ్రిడ్జి మొత్తం నిడివి 2.73కిలోమీటర్లలో స్లీపర్లు మార్చాలని నిర్ణయించారు. దీనికి ప్రత్యేకంగా టీఆర్టీ యంత్రాన్ని వినియోగించారు. మొత్తం 4,856 స్లీపర్లను మార్పుచేశారు. సాధారణంగా మనుషులతో అయితే 10స్లీపర్లు వేయడానికి సుమారు 10రోజులు పడుతుంది. ఈ యంత్రం నిమిషానికి 9స్లీపర్లను వేసేస్తుంది. దీంతో అతి తక్కువ సమయంలో పనులు పూర్తిచేశారు. పాత స్లీపరు బరువు 280 కిలోలు కాగా ఇప్పుడు 350కిలోల బరువు కలిగిన స్లీపర్లు వేశారు. ఇవి 25-32 యాక్సిల్ లోడ్‌ని కూడా తట్టుకోగలవు. ఈ స్లీపర్లు వేసినచోట రైలు గరిష్ఠంగా గంటకు 160 కిలోమీటర్ల స్పీడుతో పరుగులు పెట్టవచ్చు. ప్రస్తుతం చాలాచోట్ల గంటకు 130 కిలోమీటర్ల వేగాన్ని అనుమతిస్తున్నా.. బ్రిడ్జి కావడంవల్ల దీనిపై గంటకు గరిష్ఠంగా 80 కిలోమీటర్ల స్పీడు వరకూ అనుమతించనున్నారు.

బాలికలపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

● తమకు అప్పగించాలని తల్లిదండ్రుల ఆగ్రహం



ఉపాధ్యాయుడు సుధీర్‌ను సస్పెండ్ చేసినట్టు ప్రకటించిన ఎంఈవోలు

కొత్తపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో పాఠాలు చెబుతూ బాలికలపట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని తమకు అప్పగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేపట్టిన సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కేఎస్ఈజెడ్ కాలనీ ప్రాథమిక పాఠశాల వద్ద శుక్రవారం జరిగింది. కేఎస్ఈజెడ్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నడికి సుధీర్ ఐదో తరగతి విద్యార్థినిలకు పాఠాలు చెబుతూ అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు సెల్‌ఫోన్‌లో అశ్లీల చిత్రాలు చూపిస్తూ వేధించేవాడు. అక్కడితో ఆగకుండా బాలికలు చెప్పుకోలేని విధంగా తాకడం వంటి వికృత చేష్టలు చేయడం వంటివి చేయడంతో బాలికలు వారి తల్లిదండ్రులతో చెప్పుకొని రోదించడంతో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఏవీ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే ఆ ఉపాధ్యాయుడిని తక్షణం అప్పగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రస్థాయిలో ఆందోళన చేపట్టారు. పరిస్థితిని గమనించిన ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు మండల విద్యాశాఖాధికారులు బుర్రా వేణుగోపాల్, పైడి రాజులకు విషయం తెలియజేశారు. ఇదే విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో డీఈవో ఉపాధ్యాయుడు సుధీర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యాయుడిని సెస్పెండ్ చేసినట్లు ఎంఈవోలు ప్రకటించారు. ఉపాధ్యాయుడు సుధీర్‌ను తమకు అప్పగించాలని తల్లిదండ్రులు అధికారులను డిమాండ్ చేశారు. విద్యాశాఖాధికారులు వేణుగోపాల్, పైడిరాజు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తల్లిదండ్రులకు ఇటువంటి సంఘటనలు పునరావృతంకావని నచ్చచెప్పారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అమలాపురం శివారు కంసాల కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్న సరెళ్ల కవిత (31) శుక్రవారం మధ్యాహ్నం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త సునీల్ పశ్చిమగోదావరిజిల్లా నర్సాపురంలో జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఒక పాప, బాబు ఉన్నారు. చిన్నారులు ఇద్దరూ పాఠశాలకు వెళ్లిన తరువాత కవిత ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని మృతి చెందింది. వారి కుటుంబానికి సన్నిహితుడైన దూనబోయిన పెద్దిబాబు తలుపులు పగులగొట్టి చూసేసరికి కవిత మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కవిత స్వగ్రామమైన అల్లవరం మండలం గూడాల కాగా ఆమె తండ్రి జట్టు కూలీగా పనిచేస్తున్న సమయం నుంచి పెద్దిబాబు ఆ కుటుంబానికి సన్నిహితుడిగా మెలుగుతున్నాడు. మృతురాలి భర్త సునీల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ వీరబాబు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి శవ పంచనామా పూర్తిచేశారు. అనంతరం మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

360 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుకున్న గంజాయిని మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు

గండేపల్లి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి జాతీయ రహదారి మీదుగా తరలిపోతున్న 360 కిలోల గంజాయిని గండేపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గండేపల్లి పోలీస్‌స్టేషన్‌వద్ద శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు వివరాలను వెల్లడించారు. కాకినాడజిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు వచ్చిన సమాచారం మేరకు గురువారం మధ్యాహ్నం గండేపల్లి జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎస్పీ రాజాపురంవద్ద కంటైనర్‌లో గంజాయి తరలిస్తుండడాన్ని గుర్తించారు. 18 బస్తాల్లో 360 కిలోల గంజాయి, కంటైనర్, స్విఫ్ట్ కారు, హోండా మోటార్ సైకిల్, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేరళకు చెందిన సాబు చూతం పరంబిల్ దేవాస్సిను అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, సొత్తు విలువ రూ.26,79,750 ఉంటుంది. గంజాయిని ఏజెన్సీ నుంచి కేరళకు తరలిస్తున్నారు. పరారీలో ఉన్న వ్యక్తుల కోసం ప్రత్యేక బృందాలను పంపించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కేసులో చురుగ్గా వ్యవహరించిన గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు, సిబ్బంది ఖాజా, గిరిబాబులను ఎస్పీ బిందుమాధవ్, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ అభినందించారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

తునిరూరల్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రైలులో పయనిస్తూ వ్యక్తి మృతి చెందిన ఘటన తుని రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కాకినాడజిల్లా తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.... లోకమాన్య తిలక్ సూపర్‌ఫాస్ట్ రైలు ముంబై నుంచి విశాఖపట్నం వెళుతుండగా రైలులో ప్రయాణిస్తున్న సుమారు 47ఏళ్ల వయస్సు గల వ్యక్తి అస్వస్థతకు గురవడంతో తుని రైల్వేస్టేషన్లో అత్యవసరంగా రైలు నిలిపారు. సంబంధిత వ్యక్తిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయినప్పటికీ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన రైల్వేపోలీసులు మృతుడి వివరాల కోసం ఆరా తీయగా మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేనట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుడి చెయ్యిపై పువ్వు మొక్క పచ్చబొట్టు, చొక్కా నీలం రంగు, ట్రాక్ ధరించి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

తాగునీటి కాలుష్యంపై తిరుపతి ఐఐటీ బృందం తనిఖీ



తనిఖీలు చేస్తున్న తిరుపతి ఐఐటీ కళాశాల నుంచి వచ్చిన పర్యావరణ ఇంజనీర్లు

సామర్లకోట, ఫిబ్రవరి 7: (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా సామర్లకోట మున్సిపాల్టీ పట్టణ ప్రజలకు కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు ఇటీవల కలుషితం అవుతుందన్న పలువురి ఆరోపణల మేరకు తిరుపతికి చెందిన ఐఐటీ ప్రొఫెసర్ల బృందం శుక్రవారం సామర్లకోటకు చేరుకుని ఫిల్టర్‌వాటర్ స్కీంను, తాగునీటి సరఫరా విధానాలను పరిశీలించారు. మున్సిపల్ డీఈ శశిధర్, ఏఈ శ్రీనివాసు తదితర వాటర్‌వర్క్స్ సిబ్బంది వీరి వెంట ఉన్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెంనకు చెందిన నిట్ జాతీయ యూనివర్శిటీ ప్రొఫెసర్ల బృందం తనిఖీలు నిర్వహించి నీటి నమూనాలు విశ్లేషణ నిమిత్తం తమ వెంట తీసుకువెళ్లిన విషయం విదితమే. తాజాగా శుక్రవారం మరో ప్రొఫెసర్ల బృందం నీటి నమూనాలు సేకరించి విశ్లేషణ నిమిత్తం తమవెంట తీసుకువెళ్ళారు. ఈ బృందంలో పర్యావరణ ఇంజనీర్లు డాక్టర్ నిప్పట్లపల్లి నర్సమ్మ, డాక్టర్ పుట్టంరెడ్డి శివసాయి, అవినాష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతి



సత్యనారాయణ(ఫైల్)

జీజీహెచ్ (కాకినాడ), ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్థానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి అనంతరం కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ రూరల్ మండలం, వెలమల తూరంగికి చెందిన మడ్డు వీర వెంకట సత్యనారాయణ (24)కు తల్లి అర్జునమ్మ, సోదరి ఉన్నారు. కాగా ఆయువకుడు అవివాహితుడు. అతను గత నాలుగేళ్ళుగా కాకినాడ జీజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అయితే ఆ యువకుడు గత కొంతకాలంగా వన్‌సైడ్ లవ్‌లో ఉన్నాడు. ఈ క్రమంలో అతని ప్రేమ విఫలం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైయ్యాడు. ఈ నేపథ్యంలో ఇటీవల అతను శీతలపానీయంలో గడ్డి మందు కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర అస్వస్థతకుగురైన ఆ యువకుడుని కుటుంబీకులు జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

ఓఎన్జీసీ కాంట్రాక్టు డ్రైవర్లకు

ఫెయిర్‌వేజ్ అమలు చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్

రాజమహేంద్రవరం సిటీ , ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఓఎన్జీసీ బేస్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు డ్రైవర్ల కష్టాన్ని కాంట్రాక్టర్లు, యూనియన్ నాయకులు దోచుకుంటున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ఆరోపించారు. యాజమాన్యం తక్షణమే వారికి ఫెయిర్ వేజ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎఎన్జీసీ కేజీ బేసిన్ రాజమండ్రి అసెట్‌లో 350 మందికిపైగా డ్రైవర్లు కాంట్రాక్టు వర్కర్లుగా పనిచేస్తున్నారని అన్నారు. కాంట్రాక్టర్లు యాజమాన్యంతో కుదుర్చుకున్న ఒప్పందం నిబంధనలకు తూట్లు పొడుస్తూ కాంట్రాక్టు డ్రైవర్లకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. రెండేళ్ల క్రితం వరకూ కాంట్రాక్టు డ్రైవర్లు నెలకు రూ.22,000ల నుంచి రూ.25,000వేతనం తీసుకునేవారని, కొత్త కాంట్రాక్టరు గత రెండేళ్లగా కేవలం రూ.14,000లు మాత్రమే చెల్లిస్తూ వారిని దోపిడీ చేస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని కార్మికులు యూనియన్ నాయకుని వద్ద పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలా లేదన్నారు. చివరకు గత్యంతరం లేక కార్మికులు ఆ యూనియన్‌కు రాజీనామా చేసి సీఐటీయూలో చేరారని, కార్మిక శాఖ వద్ద కేసు వేశారని వెల్లడించారు. ఇంత దోపిడీ జరుగుతున్నా సంస్థ యాజమాన్య అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. తక్షణమే కాంట్రాక్టు డ్రైవర్లకు కనీస వేతనంతోపాటు ఫెయిర్ వేజ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పవన్, నాయకులు ఎస్ఎస్ మూర్తి, కాంట్రాక్టు డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

● డీఎస్పీ భవ్యకిషోర్


దుళ్ళలో రైతులతో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యకిషోర్

కడియం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రోజుల్లో నేరాలు జరుగుతున్న తీరు మానవాళిని భయపెట్టేలా ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ భవ్యకిషోర్ తెలిపారు. డీఎస్పీ భవ్యకిషోర్ శుక్రవారం సీఐ ఏ.వెంకటేశ్వరరావు, ఎస్ఐ ఎన్.దుర్గాప్రసాద్‌లతో కలిసి దుళ్ళ చిట్టూరి వెంకన్న చౌదరి పొలంలో 10 ఎకరాల గడ్డివాము దగ్ధమైన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం వంతెన సెంటర్‌లో అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ప్రస్తు తం జరుగుతున్న నేరాలలో యువత ఎక్కు వగా ఉండటం ఆందోళన కలిగించే విషయం అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల చదువు, వ్యవహరిస్తున్న తీరు గమనిస్తూ సక్రమ మా ర్గంలో ఉండేలా చూసుకోవాలన్నారు. మోటారుసైకిళ్ళ చోరీ, మహిళ మెడల్లో బంగారు చైన్లు తెంపి పారిపోవడం చేస్తున్నారన్నారు. వేసవి కాలం దృష్ట్యా ఆరుబయట, మేడపైన నిద్రించడం వలన దొంగతనాలు ఎక్కువగా జరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రజాప్రతినిధులు,సిబ్బంది ఉన్నారు.

నులిపురుగుల నివారణను విజయవంతం చేయాలి

● వైద్యాధికారి మణిజ్యోత్స్న

కడియం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం చేపట్టామని మండలంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోను 1 నుంచి 19 ఏళ్ల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను మింగిస్తున్నామని వైద్యాధికారి మణిజ్యోత్స్న తెలిపారు. వైద్య, ఆరోగ్య, విద్యా, స్త్రీ, శిశుసంక్షేమ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిమిత్తమై సన్నాహక సమావేశం జరిగింది. వైద్యాధికారి ఎం.మణిజ్యోత్స్న, ఎంఈవో 2 నాగేశ్వరరావు, ఏసీడీపీవో కనకవల్లి, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రామకృష్ణ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


కడియంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

భ్రమల్లో బతుకుతున్న జగన్

● రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ ఎన్నికల్లో 11 సీట్లకే పరిమితమైనా వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డి ఇంకా భ్రమల్లోనే బతుకుతున్నారని, జగన్ సీఎంగా 1.0 ఒక ప్లాప్ సినిమా అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ మరలా ఇప్పుడు 2.0 అంటే ఏంటో చూపిస్తాను అంటూ మాట్లాడుతున్నారని, గతంలో వచ్చిన సీట్లు కూడా వైసీపీకి రావనే సంగతి గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రజల చేత తిరస్కరించబడిన జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వలేదని, జగన్ మాటలు విని వైసీపీ నాయకులతో పాటు ప్రజలు కూడా నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన రైల్వే బడ్జెట్‌లో కానీ, కేంద్ర బడ్జెట్లో కానీ రాష్ట్రానికి భారీగా కేటాయింపులు చేశారని, గతంలో ఏనాడైనా ఇంత పెద్ద ఎత్తున కేటాయింపులు జరిగాయా అని ప్రశ్నించారు. కూటమి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో కూటమి నాయకులు కాశి నవీన్‌కుమార్, అత్తి సత్యనారాయణ, రెడ్డి మణేశ్వరరావు, బుడ్డిగ రాధ, ఎనుముల రంగబాబు, తదితరులు పాల్గొన్నారు.

మానసిక రుగ్మతలతో జగన్ సతమతం

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం జగన్మోహనరెడ్డి మానసిక రుగ్మతలతో సతమతమవుతున్నట్టు కనబడుతున్నదని, ఆయన చేస్తున్న చిత్ర విచిత్ర ప్రకటనలతో ప్రజల్లో నవ్వులపాలవుతున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ రాజకీయాల్లో ఉన్నవారు నైతిక విలువలు పాటించాలని, కేరక్టర్ ఉండాలని, చట్టబద్ధంగా తనకు ప్రతిపక్ష హోదా దక్కకపోయినా ముఖ్యమంత్రి చంద్రబాబుదే తప్పు అంటూ జగన్ మాట్లాడుతున్నారని, ఆయన నోట ఇలాంటి మాటలు రావడం విడ్డూరంగా ఉందని తెలిపారు. తనను ప్రజలు ఎందుకు ఓడించారో ఆత్మ విమర్శ చేసుకుని మానసిక వైద్యులను సంప్రదించాలని గన్ని కృష్ణ సూచించారు.

గుండెపోటు రోగులకు వైద్యసేవలు

కడియం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): సామాజిక ఆరోగ్యకేంద్రం నందు గుండెపోటుకు గురైన రోగులకు ఈసీజీ పరీక్షలు నిర్వహించి తద్వారా గుండెపోటు నిర్ధారణ చేసిన తరువాత రూ.45వేలు విలువైన టెనెక్టేప్లేజ్ ఇంజక్షన్ ఉచితంగా చేస్తామని కడియం సామాజిక కేంద్రం మెడికల్ సూపరింటెండెంట్ జి.రత్నమాధురి తెలిపారు. గతంలో గుండెపోటుకు గురైన నలుగురికి ఇంజక్షన్ ఉచితంగా చేశామన్నారు.


దుళ్ళలో శేషవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

వైభవంగా ప్రారంభమైన స్వామివారి బ్రహోత్సవాలు

కడియం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కడియం మండలం దుళ్ళలో శ్రీభూసమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. 12వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు. శుక్రవారం పూజా సంకల్పం, శ్రీవిశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అకల్మషహోమాలు, నీరాజన మంత్ర పుష్పాలు, మేదీని పూజ, అంకురార్పణ, ధ్వజారోహణ వంటి పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ అత్యంత వైభవోపేతంగా జరిగింది. రాత్రి స్వామి వారు శేషవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల గోవిందనామస్మరణల మధ్య స్వామివారి రథోత్సవం జరిగింది.

చందన యాత్ర మహోత్సవాలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కోరుకొండ రోడ్డులోని నృసింహస్వామిక్షేత్రం చందన యాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మాఘదశమి కావడంతో, స్వామి నిజరూప దర్శనానికి, వేలాది భక్తులు తరలివచ్చి దర్శనం చేసుకున్నారు. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్యసింహాచలం, నాగేశ్వరరావుల పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు అవసరాల శ్రీ కిరణ్ స్వామి, తెల్లవారుజామున 3గంటలకు సుప్రభాతం, ఆరాధన, చందనోత్తరణ, సువర్ణ పుష్పార్చన, సేవ నిర్వహించారు. శనివారం ఉదయం శ్రీవారి చక్రస్నానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ఆర్ట్స్ కళాశాల పొలిటికల్
విభాగాధిపతి బాబ్జికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకున్న బాబ్జిని అభినందిస్తున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, ఇతర అధ్యాపకులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రాజకీయశాస్త్ర విభాగాధిపతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ బాబ్జీ పోతురాజు ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. పాకిస్తాన్-సౌదీ అరేబియా సంబంధాలు :1977-2008 అనే అంశంపై బాబ్జీ చేసిన విశ్లేషణాత్మకమైన పరిశోధనకుగాను ఆయనకు డాక్టరేట్ లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర తెలిపారు. పాకిస్తాన్, సౌదీ అరేబియా మధ్య మూడు దశాబ్దాలపాటు కొనసాగిన వ్యూహాత్మక, దౌత్యపరమైన సంబంధాలపై చేసిన పరిశోధనకు అంతర్జాతీయ అధ్యయనాల్లో ముఖ్యమైందిగా గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ విశిష్ట ఘనత సాధించినందుకు అభినందనలు తెలుపుతున్నట్టు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు కస్తూరి సీతామహాలక్ష్మి, సయ్యద్ ఫరా యాస్మీన్, ఇతర అధ్యాపకులు బాబ్జీని అభినందించారు.

ముగిసిన భాష్యం ఇంట్రా జోనల్
బాలికల స్పోర్ట్స్ మీట్

రాజమహేంద్రవరం సిటీ , ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): క్రీడలు, వ్యాయామంతో విద్యార్థులు దృఢంగా, ఉత్తేజభరితంగా ఎదుగుతారని మహిళా రక్షక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.మంగాదేవి అన్నారు. రైల్వే గ్రౌండ్‌లో జరుగుతున్న భాష్యం ఇంట్రా జోనల్ బాలికల స్పోర్ట్స్ మీట్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. విజేతలకు బహుమతి ప్రదానోత్సవంలో మంగాదేవి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ హెల్త్ విభాగం రాష్ట్ర కన్వీనర్ గోరంట్ల రవిరామ్ కిరణ్ గౌరవ అధ్యక్షత వహించి మాట్లాడుతూ విజేతలు జాతీయ పోటీల్లోనూ మంచి ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. భాష్యం జోనల్ ఇన్‌ఛార్జి వి.ఆంజనేయులు మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్‌కు సహకరించిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. విజేతలకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ అందజేశారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్స్, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.



స్పోర్ట్స్‌మీట్‌లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవంలో పాల్గొన్న మహిళా రక్షక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంగాదేవి

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి


ముఖ్యఅతిథిని సత్కరిస్తున్న గైట్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

రాజానగరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని యునైటెడ్ కింగ్‌డమ్‌లోని మోర్గాన్ స్టాన్లే కంపెనీ అసోసియేట్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ విజయదుర్గ కడియాల పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక గైట్ డిగ్రీ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ విభాగం, ఐసీసీ సంయుక్తంగా ఫ్యూచర్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ స్ట్రాటజీస్ ఫర్ గ్లోబల్ గ్రోత్ అండ్ ఇన్నోవేషన్ అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ పరిశ్రమల్లోని ప్రస్తుత పరిస్థితులను వివరించారు. ఫిన్‌టెక్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ రంగాల్లో ఇన్నోవేషన్‌పై నిజజీవిత సంఘటనలు, పరిశ్రమను మార్చే అధునాతన పరిష్కారాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వల్లీమాధవి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి కే.సత్యశ్రీహరి, సెమినార్ సమన్వయకర్త ఎం.శ్రీధర్‌శర్మ, ఐసీసీ సమన్వయకర్త ఏ.హేమ సాయిలత, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సంసిద్ధిత మేళాతో ఉపయోగం

● జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి గౌరీశంకరరావు


ఎఫ్ఎల్ఎన్ శిక్షణ మేళాలో ఉపాధ్యాయులు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): ఒకటో తరగతి బోధించే ఉపాధ్యాయులకు పునాది అభ్యాసన శిక్షణ కార్యక్రమంలో భాగంగా పాఠశాల సంసిద్ధిత మేళా ఎంతో ఉపయోగకరమని జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి డీ. గౌరీశంకరరావు అన్నారు. కొండగుంటూరులోని సత్యశ్రీపరియళా పాలిటెక్నిక్ కళాశాలలో 9వ విడత ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను శుక్రవారమూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ జరుగుతున్న ఆరు గదుల నుంచి ఆరు విభిన్న పద్ధతులలో ఈ మేళాను నిర్వహించారన్నారు. తూర్పుగోదావరి, కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 278 మంది ఒకటో తరగతి బోధించే ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని ఏఎంవో తెలిపారు.

శనివారంతో శిక్షణ తరగతులు ముగుస్తాయని ఆయన చెప్పారు.

10న నులిపురుగుల మాత్రల పంపిణీ : వైద్యాధికారి బెనడిక్ట్

దివాన్‌చెరువు, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 10వ తేదీన పాలచర్ల పీహెచ్‌సీలో నులిపురుగుల నివారణమాత్రల పంపిణీ చేస్తున్నట్టు వైద్యాధికారి బెనడిక్ట్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమ పీహెచ్‌సీ పరిధిలో 1 నుంచి 19 సంవత్సరాల మధ్య వయసున్నవారు 14,721 మందికి అల్బెండజోల్ మాత్రలు అందిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, కళాశాలలోని మొదటి, రెండోసంవత్సరం చదువుతున్న ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు కూడా ఈ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు విధిగా హాజరుకావాలన్నారు.

ఐదో రోజుకు వెంకన్న బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

గోకవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): తంటికొండలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ఐదో రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా విశ్వక్సేనపూజ, చక్రస్నానం, మహాపూర్ణాహుతి, మహదాశీ ర్వచనం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు దేవస్థానం నిర్వాహకులు అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించారు.

పెళ్లి కానుకను సద్వినియోగం చేసుకోండి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్


చెక్కును అందజేస్తున్న జ్యోతుల నవీన్

గోకవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): జగ్గం పేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా పేదింటి నవ వధువులకు అందిస్తున్న పెళ్లి కానుక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. కృష్ణునిపాలెంలో పెళ్లి చేసుకున్న నవ వధూవరులను శుక్రవారం ఆయన ఆశీర్వదించి ఫౌండేషన్ ద్వారా మంజూరైన రూ.20,000 చెక్కును నవవధువుకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కన్నబాబు, అడపా భరత్, పాలూరి బోస్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి7 (ఆంధ్రజ్యోతి): మంగళవారపు పేటకు చెందిన సయ్యద్ హబీబున్నీసా (52) భర్త 10 ఏళ్ల క్రితం మరణించారు. ఆమె తన చెల్లి మున్నీసాతో ఉంటున్నారు. అయితే ఏమైందో ఏమో శుక్రవారం ఒంటిపై ఇంట్లోని టర్పంటైన్ ఆయిల్ పోసుకొని నిప్పంటించుకున్నారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సస్యరక్షణతో మేలైన దిగుబడులు

● ఆత్మ పీడీ జ్యోతిర్మయి



శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

రాజానగరం, ఫిబ్రవరి7 (ఆంధ్ర జ్యోతి): వ్యవసాయ, ఉద్యానపంటల సస్యరక్షణ పద్ధతులతో మేలైన దిగుబడులు సాధించవచ్చని ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి పేర్కొన్నారు. కలవచర్ల కృషీ విజ్ఞాన కేంద్రంలో ఆత్మ-తూర్పుగోదావరి సౌజన్యంతో వ్యవసాయ, ఉద్యాన పంటల్లో సస్యరక్షణ పద్ధతులపై ఇస్తున్న నైపుణ్య శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన పీడీ మాట్లాడుతూ నైపుణ్య శిక్షణ రైతుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కేవీకే హెడ్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ ఆత్మసహకారంతో రైతు ప్రయోజనార్థం నైపుణ్య శిక్షణలను చేపట్టి రైతు, రైతు మహిలకు ఆయారంగాల్లో ప్రోత్సాహంతో పాటు సుస్థిర ఆదాయం సమకూర్చే దిశగా అనేక శిక్షణ కార్యక్రమాలను చేపడుతున్నా మన్నారు. సస్యరణాధికారి, కోర్సు కోఆర్డినేటర్ రఘునందన్ మాట్లాడుతూ రానున్నరోజుల్లో కేవీకే అధికారులు పంటక్షేత్రాలను సందర్శించి ప్రత్యక్షంగా పురుగులు, తెగుళ్ల ఉనికిని గమనించి తీసుకోవాల్సిన చర్యలు గురించి సూచిస్తారన్నారు. కార్యక్రమంలో కేవీకే ఉద్యాన పంటల అధికారి జేవీఆర్ సత్యవాణి, పశువైద్యాధికారి నాగేశ్వరరెడ్డి, సంజయ్ హెగ్డే, రవీంద్ర, సొంటెక్కే, టి.విజయ వర్ధన్, రాజానగరం, కడియం, గొల్లప్రోలు మండలాలకు చెందిన ఔత్సాహిక యువతీ, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ అంబేడ్కర్ లక్ష్యసాధనలో
రమాబాయి పాత్ర కీలకం

● ఎస్సీ బాలికల వసతిగృహంలో ఘనంగా రమాబాయి అంబేడ్కర్ జయంతి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లక్ష్యసాధనంలో ఆయన సతీమణి రమాబాయి కీలకపాత్ర పోషించారని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరం జాంపేటలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో రమాబాయి అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని వసతిగృహంలోని బాలికలతో కలసి కేక్ కట్ చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్సీ నాయకులు తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి, దారా యేసురత్నం, పాము బాబూరావు, కప్పల వెలుగుకుమారి, మోత నాగలక్ష్మి, నిర్మల, ద్వార పార్వతి సుందరి, విద్యార్థినులు, పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం జంబూపట్నానికి చెందిన మహిళ ఉరి వేసుకోవడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. తోకాడకు చెందిన పెన్నాడ వరలక్ష్మీ(24)కి జంబూపట్నానికి చెందిన వెంకట రమణతో వివాహం జరిపించారు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే, తన కూతురి మానసిక ఆరోగ్యం బాగోలేదని.. శుక్రవారం ఉరి వేసుకుని ప్రాణాలు విడించదని తమకు ఇచ్చిన ఫిర్యాదులో మృతురాలి తండ్రి గుర్రాల దుర్గారావు పేర్కొన్నారని.. కేసును దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ టీఎన్‌వీఎస్ శ్యామ్ సుందర్ తెలిపారు.

జీబీఆర్ విద్యాసంస్థల పాలక వర్గ సభ్యుడు రామారెడ్డి మృతి




అనపర్తి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి జీబీఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు గొలుగూరి బాపిరాజు తనయుడు ఆ విద్యాసంస్థల పాలకవర్గ సభ్యుడు గొలుగూరి రామారెడ్డి (75) శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీంతో శుక్రవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు, అధ్యాపకులు సంతాపసభను ఏర్పాటు చేశారు.అనంతరం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. విద్యాసంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు), ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, అధ్యాపక సిబ్బంది బి. రత్నారెడ్డి, నల్లమిల్లి పెద అబ్బాయిరెడ్డి, పిఆర్ఎల్ స్వామి, డీవీఆర్‌పి పాపిరెడ్డి, ఉమా వెంకటరెడ్డి, హరినాథరెడ్డి, షణ్ముఖి రాజు, తదితరులు సంతాపం ప్రకటించారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యామినీ	: బడాస్ రవికుమార్
సూర్యాప్యాలస్	: పట్టుదల
స్వామి	: సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి	: తండేల్
అనుశ్రీ(సాయికృష్ణ)	: ఒక పథకం ప్రకారం, మదగజరాజు
రాజా	: తండేల్
ఊర్వశి	: డాకు మహరాజ్
రంభ	: ఒక పథకం ప్రకారం, మార్కో
మేనక	: గేమ్ ఛేంజర్
అప్సర	: తండేల్
కుమారి	: తండేల్
అశోక	: పట్టుదల
వీఎస్ మహాల్(నామవరం)	: తండేల్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: తండేల్
వెంకటసూర్య(కడియం)	: తండేల్
సత్యగౌరి (అనపర్తి)	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యశ్రీ (అనపర్తి)	: తండేల్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: తండేల్
రామకృష్ణ(కోరుకొండ)	: తండేల్
గీతాసినిమాస్ (సీతానగరం)	: తండేల్
శ్రీనివాస (గోకవరం)	: తండేల్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ....
లలితామహాల్(రంపచోడవరం)	: తండేల్
నవయుగ (చింతూరు)	: తండేల్



ప్రణవ స్వరూపా..లక్ష్మీనరసింహా!



కల్యాణ కాంతులు : విద్యుత్ వెలుగులు మధ్య అంతర్వేది లక్ష్మీ నరసింహుడి ఆలయ ప్రాంగణం

ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి



కల్యాణం సందర్భంగా స్వామిని శుక్రవారం ఉదయం నుంచి పలు రకాల వాహనాలపై ఊరేగించారు..





ఆహా ఏమి వైభోగం.. కనులారా చూసి తరలించాల్సిందే.. శ్రీకర..శుభకర ప్రణవ స్వరూప లక్ష్మీనరసింహ అంటూ మనసారా కొలవాల్సిందే.. ఇలపై లక్ష్మీనరసింహస్వామి ఉభయ దేవేరులైన భూదేవి, శ్రీదేవిని కల్యాణమాడారు.. శ్రీ వైఖానస ఆగమానుసారం వైష్ణవ సంప్రదాయం ప్రకారం అర్చక బృందం శుక్రవారం దశమి రాత్రి 12:55 గంటలకు మృగశిర నక్షత్రయుక్త వృశ్చిక లగ్నమందు స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.. వైష్ణవ సంప్రదాయబద్ధంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో సాగిన ఈ కల్యాణ తంతును భక్తులు తన్మయత్వంతో చూసి తరించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు ఎక్కడెక్కడి నుంచో భక్తజనం తరలివచ్చారు. ఉదయం గ్రామోత్సవం వైభవంగా సాగింది. వేలాదిగా హాజరైన భక్తజన సందోహంతో అంతర్వేది నిండి పోయింది.. సుమారు నాలుగు గంటల పాటు సాగిన కల్యాణాన్ని భక్తులు ఆద్యంతం వీక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భీష్మఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం మధ్యాహ్నం 2.05 గంటలకు స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.



అనంత.. దారుణాలైనా రాజాలు!



- హత్యలు చేసి నేతల దర్జా
- కూటమిలోనూ చర్యలు నిల్
- డ్రైవర్ హత్య కేసులో అనంతబాబు
- మధ్యంతర బెయిల్‌పై బయటకు
- విలేకరి హత్య కేసులో రాజా
- ముందస్తు బెయిల్ కొట్టేసిన హైకోర్టు
- అయినా అరెస్ట్ చేయని పోలీసులు
- నవంబరులో కేసు సీఐడీకి అప్పగింత
- అరెస్ట్ చేసే అవకాశం ఉన్నా బేఖాతరు
- శిక్షిస్తామని యువగళంలో లోకేశ్ హామీ
- ఇద్దరు ఏ1లే.. అయినా తేలని కేసులు

వారిద్దరు వైసీపీలో అత్యంత కీలకమైన నేతలు.. జగన్‌కు బాగా సన్నిహితులు.. ఒకరేమో ఎమ్మెల్సీ.. ఇంకొకరేమో మాజీ మంత్రి.. అధికారంలో ఉండగా వీరిద్దరు చెలరేగి పోయారు.. చట్టాన్ని చుట్టంగా భావించారు. ఏం జరిగినా వెంట జగన్ ఉన్నారనే ధైర్యంతో ఏకంగా హత్యలకు పథక రచన చేశారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ హత్య కేసుల్లో ఏ1 నిందితులే. వీరిలో ఒకరేమో మధ్యంతర బెయిల్‌పై ఇప్పటికీ దర్జాగా బయటే తిరుగుతున్నారు. మరొకరేమో హత్య కేసులో హైకోర్టు తన ముందస్తు బెయిల్ కొట్టేసినా ఏ మాత్రం భయం లేకుండా స్వేచ్ఛగా తిరుగుతున్నారు. వారిద్దరే..వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కూటమి వచ్చింది..ఇంకేంటి తప్పుడు పనులు చేసిన వైసీపీ నాయకుల పనైపోతుందనుకున్నారంతా.. అయితే సీఎం చంద్రబాబు మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారు.. కాకినాడ జిల్లాలోనే చూస్తే ఇద్దరు వైసీపీ ముఖ్య నేతలపై హత్య కేసులు ఉన్నాయి. చాలా ఏళ్లగా ఈ కేసులు నానుతూనే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రాగానే నాయకుల లెక్క తేలుతుందని అంతా ఆశించారు. అయితే 8 నెలలైనా ఇప్పటి వరకూ చర్యలు కానరాకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పుడిప్పుడే ఒక్కొక్కటిగా కదలిక ఆరంభమైంది. ఎందుకంటే మాజీ మంత్రి దాడిశెట్టి రాజా నిందితుడిగా ఉన్న ఆంధ్రజ్యోతి తొండంగి విలేకరి కాతా సత్యనారాయణ హత్యకేసు విచారణలో సీఐడీ స్పీడు పెంచింది. ఇటీవల కేసును రాజమహేంద్రవరం సీఐడీకి అప్పగించడంతో డీఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విచారణలో వేగం పెంచింది. ఇప్పటికే సత్యనారాయణ కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు నమోదు చేసిన సీఐడీ త్వరలో కేసుకు సంబంధించి మాజీ మంత్రి రాజాను విచారించనుంది.ఈ నేపథ్యంలో పూర్తి ఆధారాలతో కొత్తగా ఛార్జిషీటు వేయనుంది.కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తొండంగి మండలం ఆంధ్రజ్యోతి విలేకరిగా పనిచేసిన కాతా సత్యనారాయణ 2019 అక్టోబరు15న హత్యకు గురయ్యారు. విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై ఎస్.అన్నవరంలోని తన ఇంటికి వెళ్తున్న సమయంలో రాత్రివేళ కొందరు అగంతకులు అప్పటి తుని వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న దాడిశెట్టి రాజా నివాసానికి దగ్గరలో లక్ష్మీదేవి చెరువు గట్టుపై మాటువేసి సత్యనారాయణను హతమార్చారు.ఈ సంఘటన అప్పట్లో సంచలనమైంది. ఈ హత్యకు వైసీపీ నేత దాడిశెట్టి రాజా సూత్రధారి అని మృతుడి కుటుంబీకులు అప్పట్లో ఆరోపించారు. కేసు నమోదైనా అప్పటిలో అరెస్ట్ అవకుండా పోలీసులపై ఒత్తిడి తెచ్చారు.ఈలోపు దాడిశెట్టి రాజాకు మంత్రి పదవి లభించింది. దీంతో కేసు మరింత నీరుగారిపోయింది. 2023 లో దాఖలు చేసిన చార్జ్‌షీట్ నుంచి మంత్రిగా ఉన్న దాడిశెట్టి రాజా పేరును పోలీసులు తొలగించారు. అసలు రాజాకు హత్యతో సంబంధం లేదని బుకాయించారు. ఆర్థిక కారణాలతో హత్య జరిగిందంటూ కేసును తప్పుదోవ పట్టించి మమ అనిపించారు. దీనిపై న్యాయవాది అయిన సత్యనారాయణ సోదరుడు గోపాలకృష్ణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజా పాత్రకు సంబంధించి ఆధారాలు, పలుసార్లు రాజా అనుచరులు తన సోదరుడిని బెదిరించిన ఘటనలకు సంబంధించిన వివరాలు న్యాయస్థానానికి అందించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో భాగంగా తునికి వచ్చిన నారా లోకేశ్‌ను కలిసి సత్యనారాయణ కుటుంబీకులు తమ ఆవేదన వినిపించారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.దీనిపై లోకేశ్ స్పందించి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనుకున్నట్టుగానే కూటమి ప్రభుత్వం రాగానే పోలీసులు మళ్లీ హత్య కేసును తిరిగి తెరిచారు.మూడు నెలల కిందట తిరిగి దాడిశెట్టి రాజాను పోలీసులు హత్య కేసులో ప్రధాన నిందితుడిగా చేర్చారు. ఈ నేపథ్యంలో అరెస్ట్ తప్పదన్న భయంతో రాజా ముందస్తు బెయిల్‌కు హైకోర్టును ఆశ్రయించారు. అయితే న్యాయస్థానం రాజాకు ముందస్తు బెయిల్ నిరాకరించి పోలీసుల ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, వైసీపీ నేత దాడిశెట్టి రాజాను ఏ క్షణమైనా పోలీసులు అరెస్ట్ చేస్తారని అంతా భావించారు. కానీ నెలలు గడుస్తున్నా ఇంత వరకు రాజావైపు అసలు పోలీసులు కన్నెత్తి చూడలేదు. దీంతో రాజా దర్జాగా బయటే తిరుగుతున్నారు. నవంబరులో ఈ కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. సీఐడీ తొలుత రెండుసార్లు మాత్రమే కేసు విచారణకు తుని వచ్చింది. తాజాగా రాజమహేంద్రవరం నుంచి సీఐడీ డీఎస్పీ ఆధ్వర్యంలో బృందం విచారణ ముమ్మరం చేసింది. లోతుగా దర్యాప్తు చేపట్టింది. సత్యనారాయణ విలేకరిగా ఉన్న సమయంలో రాసిన కథనాలను సేకరించే పనిలో పడింది. వీటన్నింటి లోతుగా శోధించి పూర్తిస్థాయి పక్కా ఆధారాలతో సిద్ధమవుతోంది. ఆ తర్వాత మాజీ మంత్రి రాజాను సైతం విచారించనుంది. అలాగే పక్కా ఆధారాలు అన్నీ చేతికి వచ్చిన తర్వాత అరెస్టులు, కొత్త చార్జిషీటు దాఖలు చేయనుంది.

ప్రభుత్వం మారినా.. ఏ1లు బయటే

చంపేసి.. డోర్ డెలివరీ చేసినా..

ప్రశాంత జిల్లాగా పేరొందిన కాకినాడ 2022 మేలో అట్టుడికిపోయింది. తన వద్ద పనిచేసే దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి ఆనక మృతదేహాన్ని ఇంటికి డోర్‌డెలివరీ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన ఎమ్మెల్సీ అనంతబాబు మే 18న రాత్రి కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చి పని ఉందని తీసుకువెళ్లాడు.ఆ తర్వాత తెల్లవారుజామున మే 19న మృతదేహాన్ని స్వయంగా తన కారులో అనంతబాబు కాకినాడ కుళాయిచెరువు ఎదురుగా ఉన్న డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఇంటికే తీసుకెళ్లినట్టు కేసు నమోదైంది. రోడ్డు ప్రమాదంలో సుబ్రహ్మణ్యం చనిపోయాడని ఆయన తల్లిదండ్రులను నమ్మించే ప్రయత్నం చేశాడు. సుబ్రహ్మణ్యం కుటుంబీకులు తిరగబడడంతో బెదిరింపులకు దిగాడు. ఆగ్రహంతో బాధితులు నిలదీయడంతో కారు వదిలేసి అక్కడి నుంచి అనంతబాబు పారిపోయాడు.ఈ కేసులో అనంతబాబును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. సుదీర్ఘకాలం జైల్లో గడిపిన అనంతబాబు మధ్యంతర బెయిల్‌పై ప్రస్తుతం స్వేచ్ఛగా బయటే తిరుగుతున్నాడు. హత్య కేసు ఆరోపణల కారణంగా అనంత బాబును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించిన జగన్ ఆ తర్వాత పక్కన పెట్టుకుని బహిరంగ సభలకు హాజరవడంపై అంతా నోరెళ్లబెట్టారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో భాగంగా 2023 డిసెంబరులో పిఠాపురం నియోజకవర్గంలో నిర్వహించిన దళిత సభలో సుబ్రహ్మణ్యం తల్లిదండ్రుల ఆవేదన విని చలించిపోయారు. టీడీపీ అధికారంలోకి రాగానే హత్య కేసును సీబీఐకి అప్పగించి అందరికి శిక్ష పడేలా చేస్తానని పేర్కొన్నారు.తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు దాటినా ఇంత వరకు అనంతబాబుపై ఈగ కూడా వాలలేదు. ఇచ్చిన మాట ప్రకారం లోకేశ్ ఈ కేసుపై ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉన్నా ఆపని చేయడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో జిల్లా పోలీసుశాఖ సైతం నాటి కేసుల వివరాలు సర్కారుకు పంపినా ఇంకా చలనం లేదు. వాస్తవానికి ఈ హత్యకేసును ప్రభుత్వం లోతుగా పునర్విచారించే అవకాశం ఉన్నా ఆ దిశగా అడుగులు పడడంలేదు. ఈ కేసుపై సీనియర్ న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ నిందితుడు, ఆయనకు సహకరించిన అందరూ దర్జాగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఉనప్పుడు అనంతబాబుపై పోలీసులు వేసిన ఛార్జిషీటులో అనంత బాబుపై అసలు రౌడీషీట్ లేదని పేర్కొన్నారని, ఆ తర్వాత తాము పోరాడితే రౌడీషీట్ ఉందని న్యాయస్థానానికి తెలిపారన్నారు. ఇప్పటికైనా కేసును లోతుగా విచారించేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు.



గో..గో..గోల్డ్!

- 24 క్యారెట్ తులం రూ.86,510
- 22 క్యారెట్ తులం రూ.79,300
- కేజీ వెండి రూ.98,800

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోల్డ్ ధర..గో..గో..గోల్డ్ అని ఎవరో తరుముతున్నట్టు పరుగులు పెడు తోం ది. సామాన్య మధ్యతరగతి ప్రజలకు దడ పుట్టిస్తోంది.10 గ్రాముల ధర రూ.లక్ష అవుతుందేమోననే ప్రచారం జరుగు తోంది. వెండి ధర పెరుగుతోంది. కేజీ వెండి ధర రూ.లక్షకు చేరువగా ఉంది. జనవరి నుంచి కేవలం ఫిబ్రవరికి నెల రోజుల్లో ధరలు పెరిగాయి.జనవరి ఒకటో తేదీన 22 క్యారెట్ 10 గ్రాముల బం గారం ధర 71,500గా ఉంది. జనవరి నుంచి గురువారం నాటికి రూ.7,800 పెరిగి 10 గ్రాముల ధర ఏకంగా రూ.79, 300కు చేరింది. రెండు రోజులుగా ఇదే ధర కొనసాగు తోంది. ఇదే పెరుగుదల కొనసాగితే 10 గ్రాముల ధర రూ.80 వే లకు చేరవచ్చు. నెమ్మదిగా రూ. లక్షకు చేరు తుందే మోననే అంచనాలు న్నాయి. 24 క్యారెట్ 10 గ్రాముల ధర జనవరి 1న రూ.78 వేలుగా ఉంది. గురువారం 86,510కు చేరింది. శుక్రవారం అదే ధర కొనసాగింది. నెల రోజుల్లో రూ.8,500 పెరిగింది.మాఘమాసం పెళ్లిళ్ల సీజన్ కావడంతో ధరల పెరుగుదల కొనుగోలుదారులకు అదనపు భారమే.

వెండి కేజీ రూ.98,800

వెండి ధరలు పెరిగిపోతున్నాయి. జనవరి 1న 88,400గా ఉన్న ధర గురువారం నాటికి రూ. 99 వేలకు చేరింది. మరో వెయ్యి పెరిగితే కేజీ వెండి ధర రూ.లక్షకు చేరుకునేది. కానీ శుక్రవారం రూ.200 తగ్గి 98,800లకు చేరింది. జనవరి నుంచి రూ.10,600 పెరిగింది.

కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా రామలింగేశ్వర్

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా పి.వి. రామలింగేశ్వర్ నియమితులయ్యారు. ఇక్కడి అదనపు కమిషనర్ గతంలోనే బదిలీ కావడంతో ఈ పోస్టు ఖాళీగా ఉంది.ఇప్పటి వరకూ ఆయన అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా ఉన్నారు. రాజ మహేంద్రవరం బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన బాధ్యతలు చేపట్టవలసి ఉంది.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 137 మంది గైర్హాజరు

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా శుక్రవారం 12 సెంటర్లలో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. మొదటి, రెండో ఏడాది కలిపి 1435 మంది హాజరు కాగా 137 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్. నరసింహం తెలిపారు. జనరల్ ప్రాక్టికల్స్ మొదటి,రెండో స్పెల్‌కి సంబంధించిన చీఫ్ సూపరింటెండెంట్లకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓరియంటేషన్ ట్రైనింగ్ నిర్వహించామన్నారు. ఇంటర్ పరీక్షలు దగ్గరపడుతున్న నేపథ్యంలో విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలన్నారు. విద్యార్థులు ప్రాక్టికల్స్ నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

పుష్కరాలకు 26 థీమ్ పార్కుల అభివృద్ధి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి) : వచ్చే పుష్కరాల నాటికి రాజమహేంద్రవరంలో మరో 26 పార్కులను థీమ్ పార్కులుగా అభివృద్ధి చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పార్కులు, కడియం నర్సరీల్లో టూరిజం, నగరవనం అభివృద్ధి వంటి అంశాలపై నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి సమీక్షించారు. నగరంలో పార్కులను మూస పద్ధతిలో కాకుండా ప్రత్యేక థీమ్‌తో నగర ప్రజలను, పర్యాటకులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. సెవెన్ హిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న 26 పార్కుల పనులపై విపులంగా ఆరా తీశారు. ఇప్పటికే నగరంలో కంబాల చెరువు పార్కు, దానవాయిపేట, ప్రకాశ్‌నగర్, జేఎన్‌రోడ్డు, ఏవీ అప్పారావురోడ్డు ప్రాంతాల్లో మంచి పార్కులు అభివృద్ధి చేశామని.. వాటిని మరింత విలువ ఆధారిత విధానంలో అభివృద్ధి చేయాలన్నారు. వినోదంతో పాటు విజ్ఞానం కూడా కలిగించేలా పార్కులు ఉండాలన్నారు. థీమ్ పార్కుల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వినూత్నంగా నగరవనం అభివృద్ధి చేయనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఎకో ఫ్రెండ్లీ విధానంతో పర్యావరణ పరిరక్షణ దిశగా ప్రణాళిక తయారు చేసినట్టు చెప్పారు. కడియం నర్సరీ ప్రాంతాల్లో పర్యాటక రూట్ మ్యాప్‌పై కలెక్టర్ నర్సరీల ప్రతినిధులతో సంప్రదించి కార్యరూపం చేపట్టినట్టు తెలిపారు. బోటింగ్. స్టాల్స్, జిప్‌లాగ్, అడ్వంచర్ స్పోర్ట్స్ తదితర అంశాలపై రూట్ మ్యాప్ రూపొందించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శైలజవల్లి, ఆర్ఎంసీ అధికారి అబ్దుల్ మాలిక్, సెవెన్ హిల్స్ అసోసియేషన్ ప్రతినిధులు, ఏపీ ఎంఐపీపీడీ ఎ.దుర్గేష్, ,జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, ఎంపీడీవో కె.రమేష్, కడియం డిప్యూటీ తహశీల్దార్ సునీల్ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

యువర్ అటెన్షన్ ప్లీజ్!



రైల్వేలో పనులు చురుగ్గా సాగుతున్నాయి.. గత వారం రోజులుగా పనులు వేగవంతం చేశారు.. పట్టాలపై పనులను పరుగులు పెట్టిస్తున్నారు.. శుక్రవారం ఆర్చి బ్రిడ్జిపై స్లీపర్ల మార్పు చేశారు.. 1997లో ఈ ఆర్చి బ్రిడ్జిని నిర్మించారు.. నాటి నుంచి స్లీపర్లు (సిమెంట్ దిమ్మెలు) మార్చలేదు. అంటే 28 ఏళ్లుగా స్లీపర్లు రైళ్ల కింద నలుగుతూనే ఉన్నాయి. స్లీపర్లు అన్నీ పాడైపోవడంతో శుక్రవారం మార్పుచేశారు. మరో వారంలో రైల్వే జీఎం రానుండడంతో భద్రతకు సంబంధించిన పనులు వేగవంతం చేశారు. - వివరాలు 8లో

ఖండవల్లిలో కలెక్టర్ సమీక్ష
పాగాకుపై మానుకాటు! 8

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ.. న్యాయవాదులకు హెల్మెట్‌ల పంపిణీ


న్యాయవాదులకు హెల్మెట్‌లు పంపిణీ చేస్తున్న జడ్జి అనురాధ

కొవ్వూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టుహాల్లో శ్రీరామ్ ఫైనాన్స్ సహకారంతో 20 మంది ద్విచక్ర వాహనదారులకు ఆమె హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తద్వారా ప్రమాద సమయంలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, బార్ ప్రెసిడెంటు వై.చలపతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాజశేఖర్‌ను గెలిపించండి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ముప్పిడి


కొవ్వూరు మున్సిపల్ కార్యాలయంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం, మున్సిపల్ హైస్కూల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసిన వెం టనే డీఎస్సీ ప్రకటించి విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయనున్నామన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఉపాధి కల్పించనున్నట్టు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, బోడపాటి ముత్యాలరావు, పెనుమాక జయరాజు పాల్గొన్నారు.

హృద్రోగులకు టెనెక్టెప్లేజ్ ఇంజక్షన్ ఉచితం

నిడదవోలు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఫయాజ్ అహ్మద్.. పోస్టర్ ఆవిష్కరణ


నిడదవోలు సీహెచ్‌సీలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

నిడదవోలు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుకు గురైన రోగులకు రూ.45 వేల విలువైన టెనెక్టెప్లేజ్ ఇంజక్షన్‌ను రాష్ట్ర ప్రభు త్వం ఉచితంగా అందిస్తోందని నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ డాక్టర్ ఫయాజ్ అహ్మద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆసుపత్రిలో టెనెక్టెప్లేజ్ ఇంజక్షన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటుకు గురైన వ్యక్తులకు వేసేందుకు ఈ ఇంజక్షన్ అందుబాటులో ఉందని, ఇది పూర్తిగా ఉచితమన్నారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ రవికాంత్ మాట్లాడుతూ గుండెపోటు లక్షణాలు కనిపించిన వ్యక్తికి ఈసీజీ ద్వారా నిర్ధారించి ఈ టెనెక్టెప్లేజ్ ఇంజక్షన్ ఇస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అస్మత్, డాక్టర్ సుష్మ, హెప్సిబా, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బల్లిపాడులో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠోత్సవం


సాయిబాబాను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ముప్పిడి దంపతులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లిపాడు గ్రామంలో శుక్రవారం సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించిన సాయిబాబా ఆలయ విగ్రహ ప్రతిష్ఠోత్సవం ఘనంగా నిర్వహిం చారు. స్థలదాత, గ్రామానికి చెందిన వల్లభని శ్రీనివాస వెంకటరమణ ఆర్థిక సహాయంతో నిర్మితమైన సాయి బాబా ఆలయంలో మూడు రోజులుగా బ్రహ్మశ్రీ మానేపల్లి సత్యానారాయణశర్మ ఆధ్వర్యంలో హోమాది కార్యక్రమాలు, శుక్రవారం శిఖర, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దంపతులు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని కాకర్ల శ్రీనివాస్, ఉప్పులూరి రమేష్, మద్దుకూరి శంకరం, దుగ్గిరాల జగదీష్ సత్క రించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సాయి రామ జ్ఞానమండలి ట్రస్ట్ ప్రతినిధి కాకర రామచంద్రయ్య, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పోతవరంలో ధ్వజస్తంభం ఏర్పాటు

నల్లజర్ల, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతవరం శివాలయం వద్ద ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి అనంతరం ధ్వజ స్తంభాన్ని క్రేన్ సాయంతో నిలిపారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏలేటి సత్యనారాయణ, మోత్కూరి శ్రీను, పసుమర్తి ప్రభాకరరావు, గద్దే రాఘవులు, నరసింహమూర్తి పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంకేతిక యాత్రలతో ఉపయోగం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సాంకేతిక టూర్లు ఎంతో ఉపయోగపడతాయని స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం కేఎస్ మాణిక్యాలరావు చెప్పారు. శుక్రవారం పాఠశాల స్టడీటూర్‌లో భాగంగా పెరవలి మండలం ముక్కామల రవళి స్పిన్నింగ్ ఫ్యాక్టరీలో సాంకేతి విజ్ఞానం కోసం పరిశ్రమను 9వ తరగతి విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా మాణిక్యాలరావు మాట్లాడుతూ విద్యార్థులు మిల్లులో దారం తయారవుతున్న తీరును తెలుసుకున్నట్టు చెప్పారు. ఫ్యాక్టరీ అధికారి వీరాస్వామి విద్యార్థులకు వివిధ సాంకేతిక అంశాలు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

ఎమ్మెల్యే మద్దిపాటి.. భాష్యం స్కూల్ ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్

నల్లజర్ల,ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ విద్యా సంస్థలో విద్యార్థులను చదువుకు మాత్రమే పరిమితం చేయకుండా క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. స్థానిక భాష్యం స్కూల్లో ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో మానసిక, ఉల్లాసంతోపాటు ఓటమిని తట్టుకోవడం, ఒత్తిడిని జయించడం వంటి గుణాలు అలవడతాయన్నారు. ఈ మీట్‌లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్,త్రోబాల్, లాంగ్ జంప్, షార్ట్ పుట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల జోనల్ అధికారి ఎ.శ్రీమన్నారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ జీవీ రాజు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): వెలగదుర్రు గ్రామంలో ఎమ్‌వీఎస్ రాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి సహకారంతో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 120మంది రోగులకు డాక్టర్ బషీర్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. 15మందికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముదునూరి రవీంద్రరాజు, పి.శ్రీనివాసరావు, ఎం.నారాయణరాజు, ఇందుకూరి త్రినాథరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తకు పరామర్శ

దేవరపల్లి,ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): దుద్దుకూరు గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త ఉండ్రాజవరపు రాజు ఇటీవల గాయపడడంతో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు శుక్రవారం అతడిని పరామర్శించి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సాంబ బాలశ్రీనివాస్, పాపోలు లక్ష్మణరావు, చప్పటి శివనాగప్రసాద్, పోలుమాటి నాని, షేక్ రఫీ, కిరణ్ పాల్గొన్నారు.

పొగాకుపై మానుకాటు


గోపాలపురంలో సాగవుతున్న పొగాకు తోట

- మొక్క కింది భాగం నుంచి పసుపు రంగులోకి మారుతున్న ఆకులు
- ఆపై ఎండిపోతున్న వైనం
- నారుమళ్లు వేసేటప్పుడే విత్తనశుద్ధి చేయాలి
- మొక్క ఇప్పుడున్న దశలో ఏమి చేయాలేమంటున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు
- దిగుబడిపై రైతుల్లో ఆందోళన

గోపాలపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో ప్రధాన వాణిజ్య పంట అయిన వర్జీనియ పొగాకు సాగులో మానుమచ్చ ప్రభావం చూపుతోంది. రెండేళ్లుగా కాసుల వర్షం కురిపిస్తున్న పొగాకు సాగుపై ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో రైతులకు మక్కువ విపరీతంగా పెరిగింది. దీంతో కొండలు, గుట్టలు, మెట్టలు అనే తారతమ్యం లేకుండా భూమి చదును చేసి పొగాకు సాగు చేస్తున్నారు. గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది వందలాది ఎకరాల్లో సాగవుతుంది. అందుకు ధీటుగా పొగాకు క్యూరింగ్ చేసేందుకు మండల వ్యాప్తంగా నూతనంగా బ్యారన్‌ల నిర్మాణాలు సాగుతున్నాయి. కొన్ని అధికారికం కాగా, మరికొన్ని అనధికారికం. కాగా ఈ ఏడాది వరుస తుఫాన్ల ప్రభావంతో పొగాకు నాట్లు ఆలస్యంగా జరిగాయి. నాట్లు ఆలస్యంగా వేసినా మొక్క పెంపకంపై దృష్టి సారించిన రైతాంగం వెనుకాముందు చూడకుండా పెట్టుబడులు విపరీతంగా పెట్టారు. దీంతో రైతు ఆశించినంత దిగుబడి వచ్చేలా పొగాకు తోటలు ఎదిగాయి. ఈ ప్రాంతంలో విత్తనం దగ్గర నుంచి పొగాకు విక్రయించే వరకు ఎకరానికి 6 వేల మొక్కలకు రూ.8 లక్షల వరకు ఖర్చవుతుంది. సగటున ఒక్కొక్క పొగాకు మొక్క పెంచడానికి సుమారు రూ.35 వరకు ఖర్చవుతుంది. అలా పెంచిన మొక్కకు సుమారు ముప్పావు కిలో(సుమారు 24ఆకులు) నుంచి కిలో వరకు దిగుబడి వస్తుంది. దీని ప్రకారం చూస్తే ఒక్కొక్క పొగాకు మొక్కకు గత ఏడాది ధరలను బట్టి చూస్తే ఒక మొక్కకు రూ.400 వరకు ఆదాయం లభిస్తుంది. ఎంతో పెట్టుబడులు పెట్టి మరీ తోటలను ఏపుగా పెంచి క్యూరింగ్ దశకు వచ్చే సరికి పొగాకు తోటలను మానుమచ్చ (వేరుకుళ్లు) తెగులు వెంటాడుతోంది. దీంతో పొగాకు మొక్క కింది నుంచి పైకి ఒకేసారి ఆకులన్నీ పండిపోయి అనంతరం వాడి ఎండిపోతోంది. ఈ తెగులు నియంత్రణకు ఎటువంటి మందులు అందుబాటులో లేవని, శాస్త్రవేత్తలు అంటున్నారు. నారు వేసే సమయంలో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని, అలాగే నారు నాటే సమయంలో రసాయన ద్రావణంలో మొక్క వేరును తడిపి నాటాలంటున్నారు. ఈ రెండు తప్పనిసరిగా చేస్తే వేరుకుళ్ల తెగులు రాదని, ఆ రెండు చేయకపోవడం వల్లనే ఈ తెగులు వచ్చిందని, మొక్క ఇప్పుడున్న దశలో ఏ రసాయన మందులు దానిని నియంత్రించలేవని పేర్కొంటున్నారు. దీంతో ఏపుగా పెరిగిన పంటను చూసి రైతు ఆనందించాలో లేక తోటలో మానుమచ్చ కారణంగా ఎండిపోతున్న మొక్కలను చూసి నిరుత్సాహపడాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. గోపాలపురం పొగాకుబోర్డు పరిధిలో 2215మంది రైతులు 2702 బ్యారన్లలో 5122 హెక్టార్లు పొగాకు సాగు జరుగుతోంది. అలాగే దేవరపల్లి పొగాకు బోర్డు పరిధిలో 1549 మంది రైతులకు సంబంధించి 1780 బ్యారన్లు 3337 హెక్టార్లలో పొగాకు సాగవుతోంది. విపరీతంగా పెరిగిన ఈ పొగాకు సాగులో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులకు ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉంటాయని కొందరూ రైతులు చెబుతుంటే, మరికొందరు వేరుకుళ్ల తెగులును ఎలా నియంత్రించాలోనని ఆందోళన చెందుతున్నారు.


మానుమచ్చ తెగులు సోకిన పొగాకు మొక్క


పూర్తిగా పండి వాలిపోయిన మొక్క

మెరుగైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ నాయకుడు వెంకటరత్నం



కొవ్వూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): అప్కాస్ విధానం కంటే మెరుగైన విధానాన్ని తీసుకువచ్చి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయం చేయాలని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ నాయకుడు నక్కా వెంకటరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో అప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అప్కాస్ విధానం కంటే మెరుగైన విధానాన్ని తీసుకువచ్చి అతి తక్కువ వేతనాలతో కీలక శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను, నూతన నియామకాల అధికారాలను ఆయా శాఖలకు అప్పగిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. మధ్యవర్తులు, ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పకుండా మంచి వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆయా శాఖల పర్యవేక్షణలోనే నిర్వహించాలన్నారు. అన్ని శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు నూతన విధానంలో హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు.

గోదావరిలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం



కొవ్వూరు, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని పట్టణ పోలీసులు గుర్తించారు. స్థానిక గోష్పాదక్షేత్రం వద్ద గోదావరిలో శుక్రవారం రాత్రి సుమారు 60 ఏళ్ల వయసున్న వృద్ధుడి మృతదేహం తేలుతుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఏఎస్‌ఐ జీజీ ప్రకాష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి ఒంటిపై తెలుపురంగు ప్యాంటు ఉందని, స్నానఘట్టం మెట్లపై మృతుడి చెప్పులు, షర్ట్ దొరికాయన్నారు. మృతదేహాన్ని పోస్టుమా ర్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసును మోదు చేశామని, మృతుడి ఆచూకీ తెలిసినవారు 08813 231100, 91548 75583, 94407 96622 నెంబర్లకు సమాచారం అందించాలని ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

సర్వే బృందం జవాబుదారీతనంతో ఉండాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి ▸ ఖండవల్లిలో రీసర్వే పురోగతిపై సమీక్ష


ఖండవల్లిలో సర్వేపై సమీక్ష చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పెరవలి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సర్వే బృందం జవాబుదారీతనం కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ఖండవల్లి సచివాలయంలో రీసర్వే పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొలతల ప్రకారం సరిహద్దులను కచ్చితంగా గుర్తించాలని చెప్పారు. జియో లోకేషన్ రికార్డు, ఇమేజ్ ఫీచర్‌లను ధ్రువీకరించడానికి భూమిపై వాస్తవికత ఆధారంగా గ్రౌండ్ ట్రూటింగ్ సహాయపడుతుందని, ఎటువంటి వివాదాలు లేకుండా పారదర్శకంగా ఉండేలా ఉపయోగపడుతుందన్నారు. రీసర్వేలో అభ్యంతరాలుంటే వాటి ఆర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, రెవెన్యూ అధికారులు, సచివాలయ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దుల కొలతలు సక్రమంగా ఉండాలి


సత్యవాడలో సర్వేను పరిశీలిస్తున్న ఏడీ లక్ష్మీనారాయణ

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో భూముల సరిహద్దుల కొలతలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సర్వే ల్యాండ్ రికార్డు అధికారి బి.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండలంలోని సత్యవాడలో రీసర్వే ప్రాజెక్టులో భాగంగా నిర్వహిస్తున్న పైలట్ సర్వే పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరిహద్దుల కొలతల్లో నిబంధనల్లో రాజీపడవద్దని సూచించారు. ప్రభుత్వ కొలతలు నిబంధనల ప్రకారం త్వరగా సర్వే పూర్తిచేయాలన్నారు. సరిహద్దుల కొలతలు కచ్చితంగా గుర్తించాలని చెప్పారు. రైతులతో మాట్లాడి వారి సందేహాలకు సమాధానమిచ్చి, సర్వేకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, రీసర్వే టీడీ హరిప్రసాద్, మండల సర్వేయర్ జి.శ్రీనివాసరావు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

మహాలింగేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు, స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): శ్రీగౌరీ సమేత మహాలింగేశ్వరస్వామి పరివార దేవతలు జీవ ధ్వజస్తంభంతో ప్రతిష్ఠాపన కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉపాలయాల్లో కూడా విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక హోమాలు, మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం నిర్వహించారు. మండలం నలుమూలల నుంచి భక్తులు పోటెత్తారు. భారీ అన్నసమారాధన నిర్వహించారు. కేరళ వాయిద్యకళాకారుల బృందం ప్రదర్శన ఇచ్చారు. పోలీస్ బందోబస్తు నిర్వహించి భక్తులకు అసౌకర్యం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ కమిటీ స్వాగతం పలికింది. వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. సాయంత్రం ఆలయం వద్ద గౌరీసమేత మహాలింగేశ్వరస్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి శ్రీఅక్క దేవతల ఉత్సవాలు


శ్రీఅక్కదేవతల అమ్మవార్ల విగ్రహాలు

గోపాలపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): భీమోలులో ప్రసిద్ధిగాంచిన శ్రీఅక్క దేవతల ఉత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. పూర్వం ఈ గ్రామ శివారులో వెలసిన ఏడుగురు అమ్మవార్లను ఏకశిలపై చెక్కి గ్రామస్థులు గ్రామశివారులో ఉన్న చెరువుగట్టుపై ఆలయాన్ని నిర్మించి సదరు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఏటా మూడురోజుల పాటు అమ్మవార్ల ఉత్సవాలను ఘనంగా జరుపుకునేవారు. కొన్నేళ్ల నుంచి అమ్మవార్ల ఉత్సవాలను ఒక రోజే నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల నుంచి భారీగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణమంతా చలువ పందిళ్లు వేసి ఆలయాన్ని రంగులు, విద్యుద్దీపాలతో అలంకరించారు. తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో పాటు డప్పువాయిద్యాలు, జానపద కళాకారులు, విచిత్ర వేషధారణలు, కోలాటం వంటి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చలి మంట కాగుతుండగా మూర్ఛ

దొండపూడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గోపాలపురం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): చలిమంట కాగుతుండగా మూర్ఛ రావడంతో ఓ వ్యక్తి మంటల్లో పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం.. దొండపూడి గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి అరవాల రాజు కొంతకాలంగా మూర్ఛతో బాధపడుతున్నాడు. శుక్ర వారం ఉదయం ఇంటి ముందు చలిమంట కాగుతుండగా మూర్ఛ వచ్చి మంటల్లో పడిపోయాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో శరీరమంతా కాలి మంటల్లో కొట్టుమిట్టాడుతున్న అతడిని అటువైపుగా వస్తున్న ఆటో డ్రైవర్ గమనించి మంటల్లోంచి పక్కకు లాగాడు. వృద్ధురాలైన తల్లికి తెలపడంతో స్థానికుల సహకారంతో రాజును రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

ఆర్చ్ బ్రిడ్జిపై స్లీపర్ల మార్పు

- గంటకు 130కిమీ స్పీడు సామర్థ్యం
- 1997లో వేసిన స్లీపర్లకు మోక్షం



టీఆర్టీ యంత్రంతో ఆర్చ్ బ్రిడ్జిపై స్లీపర్లు మారుస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ఆర్చ్ బ్రిడ్జి రైల్వే ట్రాక్ సేఫ్టీ మరమ్మతులు పూర్తయ్యాయని విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) నరేంద్ర ఎ.పాటిల్ పేర్కొ న్నారు. చెన్నై-హౌరా సెక్షన్‌లో ఈ బ్రిడ్జి అత్యంత ముఖ్యమైనదని తెలిపారు. ట్రాక్ రెనివల్ ట్రైన్ (టీఆర్టీ) యంత్రాన్ని వినియోగించి అత్యంత వేగంగా పనులు పూర్తి చేశామన్నారు. కీలక మైన పనులను ఎంతో శ్రమించి పూర్తి చేసిన స్థానిక రైల్వే ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. కాగా.. ఆసియా లోనే పేరు గాంచిన ఆర్చ్ బ్రిడ్జిని 1997లో నిర్మించారు. అప్పటి అవసరా లకు అనుగుణంగా ట్రాక్ ని ర్మాణం జరిగింది. అయితే, తర్వాత రోజుల్లో రైల్వే ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. కానీ 28ఏళ్ల క్రితం వేసిన స్లీపర్లే ఉన్నాయి. ప్రస్తుతం ప్రతి రోజూ 86 రైళ్లు ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో పట్టాల కింద ఉండే స్లీపర్లు(సిమెంటు దిమ్మెలు) పాడయ్యాయి. 338 స్లీపర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. సేఫ్టీ పనుల్లో భాగంగా వీటితో పాటు ఈ బ్రిడ్జి మొత్తం ని డివి 2.73కిలోమీటర్లలో స్లీప ర్లు మార్చాలని నిర్ణయించారు. దీనికి ప్రత్యేకంగా టీఆర్టీ యం త్రాన్ని వినియోగించారు. మొ త్తం 4,856 స్లీపర్లను మార్పు చేశారు. సాధారణంగా మనుషులతో అయితే 10 స్లీపర్లు వేయడానికి సుమారు 10 రోజులు పడుతుంది. ఈ యంత్రం నిమిషానికి 9 స్లీపర్లను వేసేస్తుంది. దీంతో అతి తక్కువ సమయంలో పనులు పూర్తిచేశారు.పాత స్లీపరు బరువు 280కిలోలు కాగా ఇప్పుడు 350కిలోల బరువు కలిగిన స్లీపర్లు వేశారు. ఇవి 25-32 యాక్సిల్ లోడ్‌ని కూడా తట్టుకోగలవు. ఈ స్లీప ర్లు వేసిన చోట రైలు గరిష్ఠంగా గంటలకు 160 కిలోమీటర్ల స్పీడుతో పరుగులు పెట్టవచ్చు. అయితే ప్రస్తుతం చాలాచోట్ల గంటకు 130 కిలోమీటర్ల వేగాన్ని అనుమతిస్తున్నా.. బ్రిడ్జి కావడం వల్ల దీనిపై గంటలకు గరిష్ఠంగా 80కిలోమీటర్ల స్పీడు వరకూ అనుమతించనున్నారు.

లారీ ఢీకొని భార్య మృతి

భర్తకు గాయాలు.. దివాన్‌చెరువులో ఘటన

రాజానగరం, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు గైట్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన ప్రమాదంలో భార్య మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరుకు చెందిన వాకలపూడి రాజేశ్వరి(65), భర్త వెంకటేశ్వరరావు కలిసి మోటార్‌సైకిల్‌పై రాజానగరం మండలం పల్లకడియంలో జరిగే ఓ శుభకార్యానికి వెళ్తున్నారు. మార్గమధ్యలో గైట్ కాలేజీ దాటాక అశోక్ లేల్యాండ్ సర్వీస్ సెంటర్ వద్దకు వచ్చేసరికి వీరు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్‌ను లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది రాజేశ్వరిని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. కాగా వెంకటేశ్వరావు తల, చేతులకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. చివరికి తూర్పుగోనగూడెం సమీపంలో పట్టుకున్నారు. రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ పర్యవేక్షణలో ఎస్‌ఐ మనోహర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్ స్క్రీన్1	సంక్రాంతికి వస్తున్నాం
వై.స్క్రీన్2	ఏజెంట్ గయ్ 001
అనన్య	మదగజరాజు
నిడదవోలు	
వీ మ్యాక్స్	మదగజరాజు
రాధాకృష్ణ	సంక్రాంతికి వస్తున్నాం
శ్రీగణపతి	డాకు మహారాజ్
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్	గేమ్ ఛేంజర్
త్రినాథ్	డాకూ మహారాజ్